VISALAANDHRA VIJAYAWADA PHONE No. 376

4 పేజీలు 6 నయాపైసలు రిజిష్టరు నెం. 193

విశాలాంధ్ర

706189

సంపుటి 8] విజయవాడ • 29 ఆగస్టు 1959 • శనివారం [సంచిక 141

'భూటాన్, సిక్కింలపై దాడి భారత దేశంపై దాడిగానే పరిగణిస్తాం'

శ్రీ నెహ్రూ

న్యూఢిల్లీ, ఆగస్టు 28

భూటాన్, సిక్కిం భాగాలపై చైనా దాడి జరిపితే దానిని భారత దేశానికి వ్యతిరేకంగా జరిపిన దాడిగానే భారతదేశం పరిగణిస్తుందని నేడు లోక్ సభలో ప్రధాని నెహ్రూ ప్రకటన చేశారు.

హైదరాబాదులో 4 వేల మంది కార్మికుల సమ్మె

ప్రభుత్వ ఆహార విధానానికి నిరసనగా

హైదరాబాదు, ఆగస్టు 28

అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ఆదేశానుసారం, హైదరాబాదులో వివిధ సంస్థల్లో పనిచేస్తున్న 4 వేలమంది కార్మికులు ప్రభుత్వ ఆహార విధానానికి నిరసనగా నేడు సమ్మె చేశారు. సమ్మెదారులంతా నేడు పట్టణముఖ్యవీధుల్లో ఊరేగింపు జరిపారు. సికింద్రాబాదులోని హోటళ్ళు, రెస్టారెంటులు, కూడా ఒకగంటసేపు మూసివేశారు. హైదరాబాదులోని అనేక దుకాణదార్లు తమ దుకాణాలపై నల్ల జండాలు ఎగురవేశారు.

ప్రభుత్వ ధాన్య వ్యాపారపథకం అమలుజరక్కుండా కుంభకోణం

ఎవరు కారకులో విచారణ జరపాలని రాజ్యసభలో శ్రీ భూపేష్‌గుప్త డిమాండ్

మొత్తం ఆహార విధానంలో మార్పు రానిదే ఒకమంత్రి పోతే మాత్రం ఫలితమేమిటని ప్రశ్న

(విశాలాంధ్ర విలేఖరి)

న్యూఢిల్లీ, ఆగస్టు 27

ఆహార ధాన్యాలలో ప్రభుత్వ వ్యాపార పథకం ఎందుకు అమలు జరపలేదో, దీనిని ఎవరు భగ్నం చేశారో సమగ్రమైన విచారణ జరిపించాలని నేడు రాజ్యసభలో ఆహారసమస్యపై చర్చను ప్రారంభిస్తూ కమ్యూనిస్టుపక్ష నాయకుడు శ్రీ భూపేష్‌గుప్త డిమాండు చేశారు.

రాజ్యసభలో నేడు ఆహార సమస్యపై మూడు గంటలు చర్చ జరిగింది. శ్రీ భూపేష్‌గుప్త మాట్లాడుతూ, ఆహారమంత్రి శ్రీ అజిత్ ప్రసాద్ జైన్ రాజీనామాకు హర్షం వెలిబుచ్చారు. ఆహారసమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైనట్లు ఈ రాజీనామా వలన రుజువు అయిందనీ, అయితే వ్యక్తిగతంగా ఎవరు దీనికి బాధ్యులో వారు తమబాధ్యతను బాహాటంగా ఒప్పుకోలేదనీ అన్నారు. ఇంకా ఇలా అన్నారు:

ఆహార సమస్యా పరిష్కారానికి కొత్త మార్గాలు అన్వేషించడానికీ, కొత్త దృక్పథం అవలంబించడానికీ ఈ రాజీనామా జరిగిఉంటే అందుకు ప్రతివారూ సంతోషిస్తారు. రాజీనామా ప్రధానం కాదు. ఆహార విధానంలో మార్పు తీసుకురావడం ప్రధానం.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 12 సంవత్సరాలైనప్పటికీ ఆహార సమస్యా పరిష్కారానికి ఒక దోవా, తెన్నూ లేకుండాఉంది. ఈసంవత్సరం పంటలు బాగా పండాయని ఒక వైపున అంటూనే ఉన్నారు. మరొక వైపున గత ఏడాదికంటే ఎక్కువగా ధరలు పెరిగిపోయాయి. అస్థిరత్వంలోన, తుఫానుస్థితిలోను మనం పడి ఉండవలసినపరిస్థితిఏర్పడింది. ప్రస్తుతం మన దేశంలో ఆహారోత్పత్తి స్థాయి, ప్రభుత్వఆహారవిధానమూ ఇదేవిధంగా కొనసాగితే ద్వితీయప్రణాళిక ఆఖరుకు ఉత్పత్తి కావలసిన 8 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు, తృతీయ ప్రణాళిక ఆఖరుకు (1966) ఉత్పత్తి కావలసిన 11 కోట్ల టన్నులూ ఉత్పత్తి కావడం సందేహాస్పదం.

ఆహార ధరల పెరుగుదలకు కారణం

ఋణగ్రస్త ద్రవ్యవిధానాన్ని తగ్గించడానికి, ఆహార ధాన్యాలలో ప్రభుత్వ వ్యాపారపథకాన్ని అమలుచేయడానికి ఎట్టి ప్రయత్నం లేకపోవడం, అత్యవసర వస్తువుల చట్టాన్ని వినియోగించకుండా మూలబెట్టి ఉంచడం ఇవన్నీ ఆహారధాన్యాల ధరల పెరుగుదలకు కారణాలు.

ప్రభుత్వ వ్యాపార పథకాన్ని ఖచ్చితంగా అమలుజరిపి ఉంటే ఋణగ్రస్తద్రవ్యవిధానంవలన వచ్చే చెడుగులకు అది విరుగుడుగా పనిచేసి ఉండేది. అందుచేత యిప్పుడైనా ధరలను అరికట్టడానికి ఋణగ్రస్త ద్రవ్యవిధానాన్ని తగ్గించాలి. కొత్త ఆహారమంత్రి ఈ విషయాన్ని చాల జాగరూకతతో చూస్తారని, ఆర్థికశాఖతోను, కేంద్ర ప్లానింగ్ కమిషన్‌తోను చర్చిస్తారనీ ఆశిస్తున్నాను.

ఈ రోజుదాకా ప్రభుత్వం రక్షణ జాగ్రత్తకోసం నిల్వబెట్టిన ధాన్యం చాల తక్కువ. ధరలను కూడా స్థిరీకరించలేదు. దొంగచాటుగా ధాన్యాన్ని ఒక మండలంనుండి మరో మండలానికి చేరవేయడం సాగుతూనేవుంది. ఆహార మండలాలను ఏర్పరచినా, దానివలన ఆ మండలంలో వున్న ప్రజలకు దాని ప్రయోజనం లేకుండా పోతోంది. ఈవిధంగా కేంద్ర ప్రభుత్వం ఆహార సమస్యలో ప్రజలకు వ్యతిరేకమైన, దొంగ వ్యాపారులకు అనుకూలమైన విధానాన్ని అనుసరిస్తున్నది.

పశ్చిమ బెంగాల్‌లో ఆహారపరిస్థితి చాల ప్రమాదకరంగా వున్నదంటూ శ్రీ భూపేష్‌గుప్త ఇలా అన్నారు:

రాష్ట్ర ప్రభుత్వం ఆహారసమస్యను పరిష్కరించకపోగా దారుణమైన నిర్బంధ విధానాన్ని ప్రారంభించింది. నాలుగు వేల మందికిపైగా ఇప్పటికే అరెస్టుచేసింది. ఆహారం విషయంలో ఒక పద్ధతి అంటూ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం విచ్చలవిడిగా వ్యవహరించింది. రాష్ట్ర ఆహార మంత్రికి అనుకూలురైన వారందరికీ స్వేచ్ఛగా పర్మిట్లు పంచిపెట్టబడ్డాయి.

తాము జారీచేసిన కంట్రోలు ఆర్డర్లనే ప్రభుత్వం అమలు జరపలేదు. తత్ఫలితంగా మొదట నాలుగు అయిదు మాసాల్లోనే తిండి గింజలన్నీ నిల్వ వ్యాపారస్తుల చేతుల్లోకీ, అధిక లాభాలను దోచేవర్తకులచేతుల్లోకీ వెళ్ళాయి. ఆ తరువాత అకస్మాత్తుగా కంట్రోళ్లను రద్దు చేశారు. కంట్రోళ్ళను రద్దుచేసే ఈ ప్రమాదకరమైన విధానానికి కేంద్ర ప్రభుత్వం ఎలా ఆమోదించగలిగిందని నేను ప్రశ్నించుచున్నాను. పశ్చిమ బెంగాల్‌లో తిండి గింజలు ప్రజలకు సంతృప్తికరంగా అందేటట్లు చూడటం కేంద్ర ప్రభుత్వం కర్తవ్యం. రాష్ట్ర ఆహారమంత్రి నైదొలగే వరకు అక్కడ పరిస్థితి బాగుపడదు. అందువలన శ్రీ ఎస్. కె. పాటిల్ను పశ్చిమ బెంగాల్ వెళ్ళి అక్కడ పరిస్థితిని స్వయంగా పరిశీలించవలసిందిగా కోరుతున్నాను. ఆహార సమస్యను పరిష్కరించడంలో మా పార్టీ పూర్తిగా సహకరించగలదని వాగ్దానం చేస్తున్నాను.

తీర్మానం

చర్చను ప్రారంభించే ముందు శ్రీ భూపేష్‌గుప్త దేశంలో ఆహారపరిస్థితిని పరిశీలనలోకి తీసుకోవాలని ఒకతీర్మానాన్ని ప్రతిపాదించారు.

ఆహార, వ్యవసాయ మంత్రిత్వశాఖ విధానంలో తీవ్రమైన మార్పులను తీసుకొని వచ్చేందుకు ప్రభుత్వం అన్ని

(మిగతా 4 వ పేజీలో)

బెంగాల్లో మరో 3 వందలమంది అరెస్ట్

కలకత్తా, ఆగస్టు 27

పశ్చిమబెంగాలులో, క్షామనివారణకమిటీ ఆధ్వర్యాన సాగుతున్నసత్యాగ్రహంలో, నేడు మరో 300 మంది అరెస్టయ్యారని పోలీసు అధికారులు వెల్లడించారు.

అరెస్టయినవారిలో రాష్ట్ర శాసన సభ్యుడూ, క్షామ నివారణ కమిటీ సమావేశకర్త అయిన శ్రీ హేమంత కుమార బోసు కూడా వున్నారు.

సత్యాగ్రహం కలకత్తాలోనూ, జిల్లా ముఖ్యపట్టణాల్లోనూ జరిగింది.

ఈ మూడు వందల మందిలో, శ్రీ హేమంతకుమారబోసునూ, కలకత్తా కార్పొరేషన్ సభ్యులయిన శ్రీయుతులు సర్వాధికారి, సచిన్ సేన్ గార్లను 'సోషలిస్టు యూనిటీసెంటర్' ప్రధాన కార్యదర్శి శ్రీ సుభదాస్ ఘోష్‌ను, ప్రివెంటివ్ డిటెన్షన్, సెక్యూరిటీ చట్టాల క్రింద అరెస్టు చేశారు.

తక్కినవారిని కోర్టు ఆవరణమందు ప్రదర్శనాలుజరిపి చట్టధిక్కారం చేశారనే ఆరోపణపై అరెస్టు చేశారు.

బెంగాల్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆహార విధానానికి నిరసనగా ఈసత్యాగ్రహం జరుగుతోంది.

ఆహార పరిస్థితిపై శ్రీ ఎ. కె. గోపాలన్

సమస్తిపూర్, ఆగస్టు 27

దేశంలో ముఖ్యంగా పశ్చిమ బెంగాలు, బీహారు రాష్ట్రాల్లో ఆహార పరిస్థితి చాలా క్లిష్టంగా వున్నదని లోక్‌సభలో కమ్యూనిస్టుపక్ష ఉపనాయకుడు శ్రీ ఎ. కె. గోపాలన్ నేడిక్కడ ఒకసభలో ప్రసంగిస్తూ అన్నారు:

శ్రీ గోపాలన్ ఇంకా ఇలా అన్నారు: "కేంద్ర ఆహారమంత్రి శ్రీ అజిత్ ప్రసాద్ జైన్ రాజీనామా ఇక్కడ మన దేశంలో ఆహార పరిస్థితి గడ్డుగా వున్నదని వ్యక్తం చేస్తున్నది.

బెంగాల్ ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీపై నిర్బంధ విధానం అమలు జరిపినంత మాత్రాన రాష్ట్రప్రజలలో వ్యాపించిన అసంతృప్తి జ్వాలలు ఆరిపోవు."

బీహారులో ఆహార ధరల పెరుగుదలతోడు, ప్రభుత్వంలో అవినీతి, పన్నులభారం కూడా తోడై ప్రజలను క్రుంగదీస్తున్నదనీ, వీటన్నిటికి వ్యతిరేకంగా కమ్యూనిస్టుపార్టీ సత్యాగ్రహం ప్రారంభించాలని నిశ్చయించిందనీ శ్రీ గోపాలన్ అన్నారు.

బెంగాలులో ఆహార సంక్షోభం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే పూర్తి బాధ్యత అని శ్రీమతి రేణూ చక్రవర్తి విమర్శ

కలకత్తా, ఆగస్టు 27

పశ్చిమ బెంగాల్ ప్రస్తుత ఆహార పరిస్థితికి అటు కేంద్ర ప్రభుత్వంగాని, ఇటు రాష్ట్ర ప్రభుత్వంగాని బాధ్యత వహించక తప్పించుకోడం సాధ్యం కాదని కమ్యూనిస్టు పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి రేణూ చక్రవర్తి నేడిక్కడ పత్రికా గోష్ఠిలో చెప్పారు.

ఈ బాధ్యతను గూర్చి చాల గందరగోళం సృష్టిస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు బాధ్యతను నెట్టుకోడానికి ప్రయత్నిస్తున్నాయని ఆమె విమర్శించారు.

కలకత్తాలోని వామపక్షాలకు చెందిన పార్లమెంటుసభ్యులు పశ్చిమ బెంగాల్లోని కొన్ని జిల్లాలలో ఆహార పరిస్థితిని పరిశీలించి వచ్చారు. ఆతర్వాత ఈ పత్రికాగోష్ఠి జరిగింది.

శ్రీమతి చక్రవర్తి యింకా యిలా తెలియజేశారు:

ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొనే నిమిత్తం ఆహార సలహా సంఘంలోని ప్రతిపక్ష సభ్యులు చేసిన అనేక సూచనలను ప్రభుత్వం కాదన్నందని పార్లమెంటు సభ్యులు నిర్ణయానికి వచ్చారు. గత కొంతకాలంగా ఆహార ధాన్యాలధరలు ఏమాత్రమైనా తగ్గుముఖంపట్టాయంటే, అందుకు రాష్ట్ర వ్యాపితంగా సాగుతున్న ఆహారోద్యమమే కారణం."

రేషన్ డిపోలద్వారా ముఖ్యంగా పల్లెప్రాంతాలలోని డిపోల ద్వారా సప్లయిచేస్తున్న బియ్యం చాలీచాల[illegible]గా వున్నాయని శ్రీమతి రేణూ చెప్పారు. దానికితోడు ఈ డిపోల ద్వారా అందించే బియ్యంచాలతక్కువరకానికి [illegible] కలవని కూడా ఆమె అన్నారు. ఇందుకు ఆమె సేకరించిన బియ్యాన్ని పత్రికలవారికి చూపించారు.

తర్వాత శ్రీమతి రేణూ ఆహార ఉద్యమాన్ని గూర్చి, రాష్ట్ర వ్యాపితంగా జరిగిన 4 వేల మంది అరెస్టులను గూర్చి ప్రస్తావిస్తూ, పశ్చిమ బెంగాల్ ప్రజలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని అణచే ఉద్దేశంతో ప్రభుత్వం అనుసరించిన నిర్బంధ చర్యలను చూసి విస్మయం కలుగుతూఉందని అన్నారు. విచక్షణా రహితంగా ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాన్ని విచ్చల విడిగా వినియోగిస్తున్నందుకు ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శించారు.

పత్రికా గోష్ఠిలో శ్రీయుతులు ఈశ్వర అయ్యర్, కె. టి. కె. తంగమణి, మహమ్మద్ ఇల్లియాస్, ప్రభాత్ కారులుకూడా పాల్గొన్నారు.

లండన్‌లో ఐక్

లండన్, ఆగస్టు 27

అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ పశ్చిమ జర్మనీ ఛాన్సెలర్ అడినోవర్‌తో సంభాషణలు ముగించుకొని నేటిరాత్రి విమానంలో యిక్కడికి వచ్చారు. బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్‌తో ఆయన సంభాషణలు జరుపుతారు.

ఐక్ యూరప్ యాత్రలో ఇది రెండవ దశ. 1918 తర్వాత లండన్ వచ్చిన ప్రప్రథమ అమెరికన్ అధ్యక్షుడు ఈయనే. విమానాశ్రయంలో ప్రధాని మాక్మిలన్, ఎలిజబెత్ రాణి ప్రతినిధి గాన్ ఫోర్డ్‌లు ఆయనకు స్వాగతమిచ్చారు.

అధ్యక్షుని రాకకు మూడు గంటల ముందు బ్రిటన్‌లోని సోవియట్ రాయబారి బ్రిటిష్ విదేశాంగశాఖ అధికారులను కలుసుకున్నారు. విదేశాంగ వ్యవహారాల పార్లమెంటరీ ఉపకార్యదర్శి లాన్స్‌డౌన్‌తో ఆయన లావోస్ పరిస్థితిని గూర్చి చర్చించారు.

తన పాఠాలను తానే విస్మరించిన నెహ్రూ

కమ్యూనిస్టుపార్టీపై ప్రధాని విమర్శలకు శ్రీ నంబూద్రిపాద్ సమాధానం

పాల్ఘాట్, ఆగస్టు 27

"భారత కమ్యూనిస్టుపార్టీ సిద్ధాంతాలు విజాతీయమైనవని, ఇతర పార్టీలవలె కమ్యూనిస్టుపార్టీ జాతీయ పార్టీగా వ్యవహరించడం లేదనీ ఇటీవల రాజ్యసభలో ప్రధాని నెహ్రూ చేసిన ప్రకటన చాల విచిత్రమైనది. ప్రపంచంలో అనేకచోట్ల సంభవించిన విప్లవాలనుగూర్చి శ్రీ నెహ్రూ తన "ప్రపంచ చరిత్రలో" యితర్లకు అనేక పాఠాలు చెప్పారు. ఆ నెహ్రూగారే చివరకు వాటిని మరచి పోయినట్లుంది. కాని ఆయనవద్ద నేర్చుకున్న యితర్లు మాత్రం ఆ పాఠాలను మరచిపోలేదన్న సంగతి గుర్తుంచుకోవాలి" అని కేరళ మాజీ ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ నేటిరాత్రి యిక్కడ జరిగిన ఒక పెద్ద బహిరంగసభలో ప్రసంగిస్తూ అన్నారు.

శ్రీ నంబూద్రిపాద్ యింకా యిలా అన్నారు: కమ్యూనిస్టు పార్టీ భారత ప్రజా జీవనం నుండే పాఠాలు నేర్చుకున్నది. అది నేర్చుకున్న విద్య, మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతాలతో ఏకీభవించింది. కేరళ భూసంస్కరణల బిల్లులాంటి బిల్లులను అమలు జరపాలన్నా, కార్మికుల జీతాలు పెంచాలన్నా, సుఖాలకోసంగాని, క్షేమం పొందడానికిగాని రష్యావైపుకు అర్రులు చాచాల్సిన పనిలేదు.

"కమ్యూనిస్టు మంత్రివర్గం తనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ సమైక్య మవడానికి ఎలా తోడ్పడింది? అని ప్రధాని నెహ్రూ నాకొక ప్రశ్న వేశారు! అయితే నేను ప్రధానికి తిరిగి నాకొక ప్రశ్న వేస్తున్నా: ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ సంపూర్ణానంద్ తన మంత్రివర్గానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలే గాకుండా, తన స్వంత పార్టీలోనే మూడింట ఒక వంతు సభ్యులనుకూడా ఎలా వ్యతిరేకం చేసుకోగలిగారు?" అని శ్రీ నంబూద్రిపాద్ అన్నారు.

ప్రధాని నిస్సహాయత

"కేరళలో ప్రతిపక్షాల ప్రత్యక్ష చర్యను ప్రధాని ఖండించారు. కాని అదే సమయంలో ఆ ప్రత్యక్ష చర్యను ఆపలేనంత అశక్తులైపోయారు. కమ్యూనిస్టు మంత్రివర్గం బర్తరఫ్ అయినందుకు గాదు అందరూ విచారించింది. తన స్వంత పార్టీని కంట్రోల్ చేయలేక, పికెటింగు హింసతో జరిపే గూండా పద్ధతుల నుండి తన పార్టీని ఆపలేకపోయిన ప్రధాని నిస్సహాయతకే అందరూ విచారం వెలిబుచ్చారు.

"కమ్యూనిస్టు మంత్రివర్గం తలపెట్టిన కేరళ భూసంస్కరణ బిల్లు లాంటి సంస్కరణల్లో కమ్యూనిజంగాని, సోషలిజంగాని లేవు. కేవలం కాంగ్రెసు పార్టీ కాగితంపై తయారు చేసివుంచిన భూసంస్కరణలనే కమ్యూనిస్టు పార్టీ అమలుజరుప బూనుకున్నది. అయిదు సంవత్సరాల కాల పరిమితి పూర్తయేవరకూ మా మంత్రివర్గం అధికారంలో వున్నట్లయితే కాంగ్రెసు పార్టీ వారి యితర కాగితంమీదవున్న మాటలను మేము ఆచరణలో అమలు జరిపి చూపించే వాళ్ళము" అని శ్రీ నంబూద్రిపాద్ అన్నారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య భవిష్యత్తు

తర్వాత మాజీ ఆరోగ్య మంత్రి డాక్టర్ మీనన్ మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుందా అన్నది సమస్యగాదని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ప్రస్తుత ప్రమాదం నుండి రక్షించుకోవడమెలాగా అన్నది ఓటర్లముందున్న సమస్య అని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీని ఎదుర్కొనే నిమిత్తం కాంగ్రెస్ కమ్యూనిస్టేతర పార్టీలతో చేతులు కలుపుతోంది దాన్నిబట్టి, తాము కమ్యూనిస్టుపార్టీని ముఖాముఖిని ఎదుర్కొలేమని కాంగ్రెసుపార్టీ తన అశక్తతను బహిరంగా అంగీకరిస్తోందన్నమాట." అని శ్రీ మీనన్ అన్నారు.

సోవియటు యూనియన్ మిచురినిస్ట్ జెనెటిక్స్ లేబొరేటరీ వివిధరకాల పంటల విత్తనాలను ఇండియా, ఆస్ట్రియా తదితర దేశాలకు పంపించింది

గోదావరి నీటిమట్టం పెరుగుదల

కాని ప్రస్తుతానికి ప్రమాదం లేదని ఇరిగేషన్ మంత్రి ప్రకటన

(విశాలాంధ్ర విలేఖరి)

హైదరాబాదు, ఆగస్టు 28

గోదావరి నీటిమట్టం నిన్న కొంత తగ్గుముఖం పట్టిందికాని, నేడుకొత్తగా వరదనీరు రావడంవల్ల మళ్ళీ హెచ్చు కారంభించింది.

ఇరిగేషన్ మంత్రికి అక్కడి అధికారులు పంపించిన వార్త ప్రకారం, నిన్న సాయంత్రం 6 గంటలకు ధవళేశ్వరం ఆనకట్టవద్ద నీటి మట్టం కొలత 14.2 అడుగులు. నిన్న ఉదయం వున్న నీటిమట్టం 18.7 అడుగులు.

ఇది బహుశా 15 అడుగుల వరకు పెరగవచ్చునని ఇరిగేషన్ మంత్రి శ్రీనరసింగరావు నేడు పత్రికలవారితో అన్నారు. కాని నీటి మట్టం 16 అడుగులవరకు పెరిగినప్పటికీ కరకట్టలు తట్టుకోగలవు కాబట్టి ప్రమాదం లేదని మంత్రి వెల్లడించారు.

రేపు రాష్ట్ర వరద నివారణ బోర్డు ధవళేశ్వరం వద్ద సమావేశమవుతోంది. గోదావరి వరద నివారణ చర్యలను గూర్చి ఆ బోర్డు చర్చిస్తుంది.

బోర్డు సమావేశంలో చర్చకు రానున్న ఇతర విషయాలివి. కడప జిల్లా చెన్నూరువద్ద పెన్నానదికి కరకట్టలు నిర్మించడం, తూర్పు గోదావరి జిల్లా బూర్గుంపాడు గ్రామం వద్ద గోదావరికి కరకట్టలు కట్టడం, కరీంనగరు జిల్లాలో మంథెనవద్ద బొక్కల వాగుకు కట్టలు వేయడం.

ఇరిగేషన్ మంత్రి, పి డబ్ల్యు. డి. రెవిన్యూశాఖ కార్యదర్శులు, ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ ఇంజనీయరు, రెవిన్యూ బోర్డు ప్రథమ సభ్యుడు మొదలగువారు సమావేశంలో పాల్గొంటారు.

బెంగాల్లో కాంగ్రెస్ పార్లమెంటు సభ్యుల పర్యటన

కలకత్తా, ఆగస్టు 27

బెంగాల్లోని ఆహార పరిస్థితిని స్వయంగా పరిశీలించడానికి ఇక్కడికి వచ్చిన 12 మంది కాంగ్రెసు పార్లమెంటు సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఆహారమంత్రిని నేడు కలుసుకొని మాట్లాడారు.

వరంగల్ జిల్లాలో 5 చెర్వులకు గండ్లు

రామప్ప చెర్వుకు వరద

హైదరాబాద్, ఆగస్టు 28

వరంగల్ జిల్లాలో సుప్రసిద్ధమైన రామప్పచెర్వుకు ఎగువ భాగంలో 5 చెర్వులు తెగి రామప్ప చెర్వుకు వరద వచ్చింది.

చెర్వులో నీటిమట్టం, వరదమట్టానికన్న 2½ అడుగులు ఎక్కువగా వుంది.

నిన్న వానలు లేనందువల్ల నీటి మట్టం మరో 2 అంగుళాలుమాత్రమే హెచ్చింది.

ప్రభుత్వం ఈ సందర్భంలో అవసరమయిన చర్యలన్నిటినీ తీసుకొంటున్నదని ఇరిగేషన్ మంత్రి పత్రికా విలేఖరులకు తెలియజేశారు. చీఫ్ ఇంజనీయర్లు శ్రీ హాల్దీకర్, ఎ. ఆర్. వెంకట్రామన్ చెర్వువద్దనే వున్నారు.

చెరువు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు, గ్రామాలువదలి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళవలసిందిగా, విమానాలనుండి కరపత్రాలు పడవేసినట్లు మంత్రిగారు చెప్పారు.

ఈ చెర్వు కాకతీయుల పాలనలో క్రీ. శ. 1213 సంవత్సరంలో నిర్మించబడింది. 12 వేల ఎకరాలకు నీరందిస్తున్నది.

టిబెట్ ఘటనలు

బ్రిటిష్ ప్రభుత్వ వైఖరిపై శ్రీమతి విజయలక్ష్మి ప్రకటన

లండన్, ఆగస్టు 27

బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్ తదితర బ్రిటిష్ మంత్రులు చైనా - భారత దేశాల పరిస్థితిని పూర్తిగా అర్థంచేసుకున్నారని, టిబెట్ పరిణామాల పట్ల నెహ్రూ అనుసరించిన పద్ధతిని వారు చాల మెచ్చుకున్నారని లండన్‌లోని భారత హైకమిషనర్ శ్రీమతి విజయలక్ష్మీపండిట్ నేడొక ఇంటర్వ్యూలో తెలిపింది.

రాజ్యసభ సభ్యుడుగా సర్దార్ పణిక్కర్

న్యూఢిల్లీ, ఆగస్టు 27

చైనా, ఫ్రాన్సు దేశాలలో భారత రాయబారిగా పనిచేసిన సర్దార్ కె. ఎమ్. పణిక్కర్ను రాజ్యసభ సభ్యుడుగా నేడు రాష్ట్రపతి నామినేట్ చేశారు. అంతకుముందు ఆస్థానంలోనున్న శ్రీ సత్యేంద్రనాథ్ బోస్ జాతీయ అధ్యాపకుడుగా నియమించబడినందున ఆస్థానంలో శ్రీ పణిక్కర్ను నియమించారు.

భారత ఈశాన్య సరిహద్దులో చైనాసేన

లోక్‌సభలో ప్రధాని నెహ్రూ ఆరోపణ

న్యూఢిల్లీ, ఆగస్టు 28

భారతదేశ ఈశాన్య సరిహద్దు ప్రాంతాన్ని ఆగస్టు నెలలో చైనా సైన్యాలు రెండుసార్లు ఉల్లంఘించాయని, ఫలితంగా ఈ ప్రాంతాన్ని సైనికాధికారులక్రింద వుంచుతూ ఉత్తర్వు లివ్వబడ్డాయని ప్రధాని నెహ్రూ నేడు లోక్ సభలో ప్రకటించారు.

ఈ ఘటనలను గూర్చి భారత ప్రభుత్వం చైనా ప్రభుత్వానికి నిరసన తెలియజేసిందని కూడా ప్రధాని చెప్పారు.

ఈ ఘటనలకు కారణమేమిటో తను ఊహాగానంచేయలేనని, అక్కడా ఇక్కడా గుర్తుపెట్టకుండా వున్న ఒక మైలు అటూ యిటూ సరిహద్దు సమస్యను తేల్చుకోవడానికే ఈ ఘటనలు జరిగితే దాని పరిష్కారానికి రౌండుటేబుల్ సమావేశం జరిపి చర్చించేందుకు తాను సిద్ధమేనని శ్రీ నెహ్రూ అన్నారు.

"మనభూభాగంలోని పెద్దప్రాంతాలను ఆక్రమించుకొనేదశలో మాత్రం అది చర్చించే విషయం కాదు... ఆతర్వాత వచ్చే ఏపర్యవసానానికైనా మనం సిద్ధంగావాలి" అని కూడా శ్రీ నెహ్రూ అన్నారు.

రక్షణ కర్మాగారాల్లో ఆయుధోత్పత్తి

పెరుగుతున్నదని రక్షణ మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 27

గత రెండు సంవత్సరాల్లో, రక్షణ శాఖకు సంబంధించిన ఆయుధ కర్మాగారాల్లో ఆయుధాలు, మందుగుండు ఉత్పత్తి బాగా పెరిగినందుకు, రక్షణ మంత్రి శ్రీ కృష్ణమీనన్ నేడు అధికారులను అభినందించారు.

శ్రీ మీనన్ నేడు రక్షణ సామగ్రి ఉత్పత్తి ద్వితీయ సమావేశానికి ప్రారంభోత్సవం జరిపారు. ఈ సమావేశం వారం రోజులు జరుగుతుంది. గత సంవత్సరం రక్షణశాఖ కర్మాగారాల్లో జరిగిన పనిని యీ సమావేశంలో సమీక్షిస్తారు. రక్షణసామగ్రి ఉత్పత్తి [illegible]కు సంబంధించిన సంస్థల అధికారుల సమావేశంలో పాల్గొంటున్నారు.

శ్రీ మీనన్ తన ఉపన్యాసంలో క్రింది విషయాలు పేర్కొన్నారు.

రక్షణశాఖ కర్మాగారాల్లో 1956 - 57 లో 14 కోట్ల 10 లక్షల విలువ చేసే సామగ్రి ఉత్పత్తి కాగా 1957 - '58 లో 18 కోట్ల 8 లక్షలకు పెరిగింది. తరువాత సంవత్సరం, అంటే 58 - '59 లో ఉత్పత్తి అయిన సామగ్రి విలువ 21 కోట్లు.

'భారత్ ఎలెక్ట్రానిక్స్' కంపెనీలో కూడా ఉత్పత్తి పెరిగింది. మన ఆయుధోత్పత్తి పెరిగినందువల్ల, విదేశాలనుండి ఆయుధాలు, మందుగుండు దిగుమతి చేసుకోవడానికై వెచ్చిస్తున్న విదేశ మారక ద్రవ్యం కూడా తగ్గింది. ఇందువల్ల 57 - 58, 58 - 59 సంవత్సరాల్లో, 7 కోట్ల రూపాయలు పొదుపయింది. ఆయుధాలుగాక, ఇతర రక్షణసామగ్రి కూడ కర్మాగారాల్లో వుత్పత్తి అవుతున్నందువల్ల మరో 11½ కోట్లరూపాయల విదేశమారకం మిగుల్చుకోగల్గాం అంటే మొత్తం 18½ కోట్ల రూపాయల విదేశమారకం మిగుల్చుకోగల్గామన్నమాట.

రక్షణశాఖకు అవసరమైన [illegible], యంత్రాలు, రసాయనిక పదార్థాలు, పెట్రోలు, మందుగుండు సరకులలో నూటికి 95 పాళ్ళు దేశంలోనే లభ్యమవుతున్నాయి.

వికారి నామ సంవత్సర
శ్రావణ
బహుళ ఏకాదశి పూర్తి
ఆర్ద్ర రా 9-58

విశాలాంధ్ర

శనివారం 29-8-1959

అహంకారం తగదు

అధికారం వుండవచ్చు; కాని దానితోపాటు అహంకారాన్ని అలవరుచుకోవడం సజ్జనలక్షణంకాదు. అధికారం, సంపద అన్నీ హిట్లరుముందు పాదాక్రాంతమయ్యాయి. ఆ అహంకారంతో అతడు మానవులు తనకు బానిసలుగాక ఎక్కడికి పోతారని కన్నూ మిన్నూ గానక సంచరించాడు. చివరకు మానవశక్తి ముందు అంతటివాడు కూడా మట్టిపాలు కాకతప్పలేదు. కాని చరిత్ర నేర్పిన యీ గుణపాఠాలు ముఖ్యమంత్రి సంజీవరెడ్డిగారికి ఏమాత్రం రుచించినట్లులేదు.

నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద కార్మికులకూ, కంట్రాక్టర్లకూ మధ్య తగాదా వచ్చింది. ప్రభుత్వం నిర్మిస్తున్న ప్రాజెక్టు పని అది. ఆ సందర్భంలో సత్వరం జోక్యం కలిగించుకొని, సామరస్య పూర్వకంగా న్యాయాన్ని కలిగించడం నాగరికతగల ఏ ప్రభుత్వానికైనా కనీసలక్షణమై యుండాలి. ఆ విధంగా సమరసభావంతో సమస్యను పరిష్కరించడానికి చీఫ్ ఇంజనీరు శ్రీ జఫ్రాలీ ప్రయత్నిస్తూనే వున్నారు. కాని ముఖ్యమంత్రిగా వున్న శ్రీ సంజీవరెడ్డి తీసుకున్న వైఖరి మాత్రం అదికాదు.

"కడుపు మాడితే వాళ్ళే వస్తారు. నాలుగు రోజులు పని ఆపివేయమని" ముఖ్యమంత్రి కంట్రాక్టర్లకు సలహా యిచ్చారట. "అవసరమైతే మా వడివు లాఠీలకు, తుపాకులకు పని కల్పించటానికి" సిద్ధంగా వున్నారట. అక్కడ ఒక శాసనసభ్యుడు "పగలు మాత్రం నిరాహార దీక్షలో వుంటూ, రాత్రిళ్ళు ఏమైనా తీసుకుంటున్నాడో లేదో" తెలియదట.

ముఖ్యమంత్రి పదవిలోవున్న వ్యక్తి, ఎంత కోపం వచ్చినా యింత హీనస్థితికి దిగజారడం దారుణం. పాతికవేలమంది కార్మికులను, ప్రజలను ఒక వైపు తూలనాడుతూ మరో వైపు కంట్రాక్టర్లను నెత్తికెత్తుకోవడం ఘోరం. మామూలు మర్యాదకు, సభ్యతకు స్వస్తిచెప్పి, తోటి శాసనసభ్యునికే గౌరవాన్నికూడా పాటించకుండా ముఖ్యమంత్రి, నిరాహారదీక్ష బూనుతున్న శ్రీ నాగిరెడ్డిపై నిందాప్రచారం చేయడం గర్హనీయం.

పైన గాంధీటోపీ ధరించి లోపల ఏపక్షానికైనా సిద్ధమయ్యే వారి సంప్రదాయాన్ని, పాతికవేలమంది దరిద్రనారాయణులకు అండగా నిలిచిన శ్రీ నాగిరెడ్డికి ఆపాదించడం ఘోరం. న్యాయమైన కూలిరేటుకు ఆందోళన చేస్తున్న కార్మికులపై, సత్యాహింసల పేరిట చలామణి అయ్యే ముఖ్యమంత్రి లాఠీలను, తుపాకులనూ ఝళిపించడంతో వారి నిజరంగును మాత్రమే వెల్లడించుకుంటున్నారు.

అనేక విధాలుగా కంట్రాక్టర్లు ముఖ్యమంత్రికిగాని, వారి పార్టీకిగాని సన్నిహితులై వుండవచ్చు. అందులో ఒకరిద్దరు మంచివారూ అయి వుండవచ్చు. కాని ఇతర చోట్ల రు. 14 ల రేటు యిస్తున్నపనికి నాగార్జునసాగర్‌లో వారిస్తున్నది రు 9 లే. ఇంతేకాదు కంట్రాక్టర్లు, లంచగొండి అధికార్లు ఏకమై అనేక చోట్ల, అనేక కట్టడాలను, నిర్మాణాలను గుల్లచేస్తున్నట్లు నిత్యం వింటున్నాం. నష్టాన్ని అనుభవిస్తున్నాం. కె. సి కెనాల్‌లో అదేరీతు జరిగింది. కట్టడం పూర్తిగావటంతోనే కడెం ఆనకట్ట బద్దలైంది. నాగార్జునసాగర్ వద్దనే కృత్రిమంగా ఒక పనిని కాగితాలపై సృష్టించి 70 వేల రూపాయల మెక్కి-కొట్టివేసిన ఉదంతం తెలియనిదిగాదు. ఇన్ని విధాల ప్రభుత్వ బొక్క-సాన్ని దోచుకుంటున్నవారూ, వారికి అవకాశమిస్తున్న ప్రభుత్వ మహాజాతీయ పునర్నిర్మాణానికి పూనుకునేవారు కాగా, కష్టపడి రాళ్ళుగొట్టి, రాతిపై రాతిని పేర్చి, కడుపునిండా తిండి పెట్టమని అడిగేవారు జాతీయ పునర్నిర్మాణాన్ని అడ్డుకునేవారుగా ముఖ్యమంత్రికి కనపడటం శోచనీయం. తొత్తవపుపనిని బయటపెట్టకలిగినవారు, అవినీతిని అరికట్టకలిగినవారు, కనీస పోషణకు ఆధారం చూపితే ఉత్సాహపడి ఏనుగంత సత్తువతో కొండలను పిండిగాకొట్టి జలాశయాలను నిర్మించకలిగినవారు కార్మికులు.

ఆటువంటి శక్తిని ఉత్సాహపరచక పోయినందుననే మన ప్రాజెక్టుల నిర్మాణం ముందడుగు వేయలేక పోతోంది. మరో రెండు సంవత్సరాలు ప్రజలు కడుపు మాడ్చుకుంటే తమ హయాంలో చాలావనులు పూర్తిచేసేస్తు శ్రీ సంజీవరెడ్డి గారు చెబుతున్నారు. ఏదీ? వంశధార ప్రాజెక్టు నిర్మాణం ఎప్పుడో అంతులేదు. పోచంపాడు ప్రాజెక్టు ప్లాను దశలోనే వున్నది. కట్టిన కడెం బద్దలైంది. ప్రచారంకోసం ఎన్ని మోసపు మాటలు చెప్పినా, అటు తిప్పి యిటు తిప్పి తుంగభద్ర ఎగువకాలవ పథకాన్నుంచి ఒకభాగాన్ని కత్తిరించినట్లే వార్తలు వస్తున్నాయి. నాగార్జున సాగర్ నిర్మాణ కాలాన్ని డబ్బులేదనిసమ్మదిగా పొడిగిస్తున్నారు. ఇనుము కొరతతో బ్రిడ్జిలు, రెగ్యులేటరూ వెనుకకు నెట్టబడుతూనే వున్నాయి.

కనుక, కట్టడాలేమైనా వెనకబడుతున్నాయంటే అందుకు కారణం కార్మికులు కాదు. సిమెంటు, ఇనుము, డబ్బు, కేంద్రప్రభుత్వం గ్రాంటుల కొరతలు ఇందుకు కారణాలు. బద్దలవుతున్న నిర్మాణాలకు బాధ్యులు దురాశా పూరితులైన కంట్రాక్టర్లూ, లంచగొండి ఉద్యోగులు. సామాన్య ప్రజల శ్రేయస్సుకు పాటుబడతామని వాగ్దానాలుచేస్తూ, ఆచరణలో ఆటువంటి అక్రమాలన్నింటికీ అండగా నిలబడుతున్న శ్రీ సంజీవరెడ్డిగారి మంత్రివర్గానిదే ఇందుకు పూర్తి బాధ్యత.

ఏమైనా అధికారంలోవున్నవారు ప్రజలపట్ల సభ్యతనూ, ఆదరణనూ ప్రదర్శించకపోవడం సబబుకాదు. నాగార్జునసాగర్ కార్మికుల కోర్కెలు న్యాయమైనవని ఆ ప్రాంతపు ప్రజానీకం అంతా ఎలుగెత్తిచాటింది. విజ్ఞప్తులు చేసి చేసి విసిగించుకోవపోతే వారీ సమ్మెకు పూనుకున్నారు. లాఠీలు తుపాకుల ప్రయోగమాని ప్రభుత్వం సభ్యతను, సామరస్యాన్ని ప్రదర్శించి సమస్యను పరిష్కరించడం ఉచితం.

ప్రపంచ శాంతికి 'నాటో' అవసరమట

ఐసెన్ హోవర్ - అడినోవర్ ల సంయుక్త ప్రకటన

బాన్, ఆగస్టు 27

ప్రపంచశాంతికి ఉత్తర అట్లాంటిక్ సైనిక కూటమి వుండటం ఎంతో అవసరమని, తమ విదేశాంగ విధానాలకు యికముందుకూడ కూటమి మూలస్తంభంగానే వుంటుందని అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్, పశ్చిమజర్మనీ ఛాన్సలర్ అడినోవర్‌లు నేడొక సంయుక్త ప్రకటనగా తెలిపారు. పశ్చిమబెర్లిన్ రక్షణకే పశ్చిమదేశాలు కంకణం కట్టుకున్నాయనికూడా ఐసెన్‌హోవర్ స్పష్టంచేశారు.

ఐసెన్‌హోవర్, అడినోవర్‌ల సంభాషణలు పూర్తయిన తరువాత ఈ ప్రకటన విడుదల చేశారు.

ఇదిలా వుండగా, ఫ్రెంచి ప్రధాని డెబ్రీ నేడు ఫ్రెంచి ప్రభుత్వ పార్లమెంటరీ నాయకులతో మాట్లాడుతూ, ఫ్రాన్సు మిత్రరాజ్యాలు అల్జీరియాలోని ఫ్రెంచి వైఖరిని అవగాహన చేసుకోలేకపోతే అట్లాంటిక్ కూటమి సమైక్యత దెబ్బతినే అవకాశం వుందని బెదరించినట్లు తెలుస్తోంది.

అడినోవర్‌తో సంభాషణల అనంతరం ఐసెన్‌హోవర్ బాన్ నుండి లండన్ వెళ్ళిపోయారు.

ఈ ఉభయ నాయకులు, నిరాయుధీకరణ, బెర్లిన్, జర్మనీ ఏకీకరణ, యూరప్ ఐక్యత, అట్లాంటిక్ కూటమి రాజ్యాల మధ్య సహకారం మున్నగు విషయాల్ని గూర్చి సంభాషించుకున్నట్లు వీరిసంయుక్త ప్రకటనలో వుంది. ఇటీవల జెనీవా అగ్రరాజ్య విదేశాంగమంత్రుల సమావేశాన్ని గూర్చి, సోవియట్ యూనియన్ పట్ల పశ్చిమ రాజ్యాల విధానాల్ని గూర్చి కూడా వీరు చర్చించారు.

ప్రపంచవ్యాపిత సమస్యల్ని గూర్చి వ్యక్తిగతంగా చర్చలు జరిపిన తరువాత వీరు తమ విదేశాంగ మంత్రులు, సలహాదార్లతో విస్తృత సమావేశాన్నొకటి జరుపుకున్నారు.

తన సంభాషణల అనంతరం ఐసెన్‌హోవర్ పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ, క్రుశ్చేవ్‌తో తానుజరుపనున్న సమావేశానికి అడినోవర్ అంగీకరించినట్లు తెలిపారు.

పశ్చిమరాజ్యాల మధ్య ఐక్యత క్షీణించిపోయినట్లు తానేమీ భావించడంలేదని కూడా ఆయన చెప్పారు.

తర్వాత అమెరికా, జర్మన్ పత్రికా విలేఖరులడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, క్రుశ్చేవ్‌తో తాను సంభాషణలేగాని సంప్రదింపులు జరుపబోవడం లేదని పశ్చిమదేశాలకు ఐసెన్‌హోవర్ మరోసారి హామీ ప్రకటించారు.

వాషింగ్టన్ సంభాషణల్లో క్రుశ్చేవ్ నూతన ప్రతిపాదనల్నిగాని లేదా నూతన భావాల్నిగాని వ్యక్తం చేయాలనికూడా ఐసెన్‌హోవర్ క్రుశ్చేవ్‌కు ఆహ్వాన రూపంలో తెలియజేశారు.

సోవియట్ ప్రధాని గనుక అటువంటి నూతన సూచనలు చేసినట్లయితే అవి పశ్చిమ దేశాలకు అనుకూలించినట్లయితే, అప్పుడా సూచనలను తనితర పశ్చిమ రాజ్యాలకు అందజేస్తానని తానుహామీ యివ్వగలనని కూడా ఆయన అన్నారు.

గతరాత్రి తనకు బాన్ ప్రజలిచ్చిన స్వాగతం బ్రహ్మాండమైనదని ఆయన చెప్పారు.

ఈరోజున మొట్టమొదటగా యిక్కడవున్న అమెరికన్ కాలనీ సందర్శించారు. ఆ తర్వాత పశ్చిమ జర్మనీ అధ్యక్షుడు ప్రొఫెసర్ థియోడర్ హ్యూస్‌ను కలుసుకున్నారు. టోపులేని కారులో ప్రయాణంచేస్తున్న ఐసెన్‌హోవర్‌కు రోడ్డుకిరువైపుల నిలబడి ప్రజలు ఘన స్వాగతమిచ్చారు. అధ్యక్షుడు ప్రత్యభివందనలు చేశారు.

తర్వాత ఐసెన్ హోవర్ ఛాన్సలర్ భవనానికివెళ్లి అక్కడ అడినోవర్‌తో సంభాషణలు జరిపారు.

ఈ సందర్భంలో ఐక్ మాట్లాడుతూ సోవియట్ ప్రధాని గనుక ఎటువంటి ప్రతిపాదనలుచేసినా, వాటిని తాను మిత్రరాజ్యాలు (పశ్చిమ దేశాలు)కు అందజేస్తామన్నారు.

"నా పర్యటనకు నేను మరొకరి తరఫున క్రుశ్చేవ్‌తో సంప్రతింపులు సాగించడంలేదు.

"క్రుశ్చేవ్‌తో నేను జరపబోయేవి సంభాషణలు మాత్రమే. ప్రపంచ శాంతికోసం ఆయనేమన్నా కొత్త సూచనలు, కొత్త ప్రతిపాదనలుగాని, చేస్తారేమో ప్రయత్నించి చూడడమే బావుంటు" అన్నారు.

క్రుశ్చేవ్‌తో మాను జరిపే సంభాషణలవల్ల ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణం సడలడానికేమైనా అవకాశం వుందా? అని విలేఖరులు ప్రశ్నించారు. ఇందుకు జవాబిస్తూ, అటువంటి అవకాశం వుందనే తాను భావిస్తున్నానని ఐక్ చెప్పారు.

మరో ప్రశ్నకు సమాధానమిస్తూ, ఫ్రాన్సుకు సంబంధించిన విషయాల్ని గూర్చి కూడా రేపే ఉదయం అడినోవర్‌తో చర్చించానన్నారు.

ఈ సందర్భంలో ఉత్తర అట్లాంటిక్ కూటమికి సంబంధించిన సమస్యలు చర్చకు వచ్చాయని, కూటమిలో ఫ్రాన్సు ప్రధాన భాగస్వామి అని ఐక్ పేర్కొన్నారు.

యూరప్ పర్యటనల్లో నిరాయుధీకరణ సంభాషణలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశం వుందా అని ప్రశ్నించగా, "లేదు, నేనా విషయాన్ని గూర్చి ఏమీ చెప్పలేను" అన్నారు.

అమెరికాచే సబ్ మెరైన్ మిసిలీ ప్రయోగం

కేప్ కానవెరాల్, ఆగస్టు 28

అమెరికా నౌకాశాఖవారు "పొలారిస్" అనే సబ్ మెరైన్ మిసిలీని నేడొక నౌకావిరాదనుండి అంతరిక్షంలోకి ప్రయోగించారు.

కేప్ కానవెరాల్‌కు 7 మైళ్ళ దూరంలోవున్న ఒక ప్రయోగకేంద్రం నుండి ఈ ప్రయోగం చేశారు. మిసిలీ ప్రయోగాన్ని పరీక్షించే నిమిత్తం - ఈ ప్రయోగం జరుపబడిందని నౌకాశాఖ ప్రకటించింది. ప్రయోగం జయప్రదమైనట్లు అధికారులు ప్రకటించారు. నేడిక్కడ ప్రయోగించబడ్డ మిసిలీలలో ఇది రెండవది. అంతకుముందు "థోర్" అనే మధ్యరకం రాకెట్టును జయప్రదంగా ప్రయోగించినట్లు కూడా అధికారులు చెప్పారు.

ఉపాధ్యాయుల కొత్త స్కేలు

కొన్ని వివరాలు

విజయవాడ, ఆగస్టు 28

ఆంధ్ర ప్రదేశ్ ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ చెన్నుపాటి లక్ష్మయ్యగారు యీక్రింది వివరాలు తెలుపుతున్నారు.

"పేకమిటీ రిపోర్టుపై వివరాలు కోరుతూ చాలామంది వ్రాస్తున్నారు. అందుచేత కొన్ని ప్రశ్నలకు ప్రకటనలో జవాబిస్తున్నాం.

ప్రశ్న: "పోస్టుగాడ్యుయేట్ గ్రేడు వారి జీతాలు కోరుకోవచ్చునా?"

జవాబు: కోరుకోవచ్చు. పేకమిటీ రిపోర్టు 52 పేజీలో 158 భాగంలో ఇలా వుంది:

"ఆయా కేడర్లకు సంబంధించిన ఉపాధ్యాయుల పదవులు ఖాళీగా లేకుంటే, అంతకన్న తక్కువజీతం స్కేలుపై నియమింపబడిన ఉపాధ్యాయులకు వారివారి అర్హతలనుబట్టి నిర్ణయింపబడిన పై స్కేళ్ళ ప్రకారం జీతాలుంటాయి."

సవరణలిస్తూవారిచేసిన ఉత్తరవులో యీ భాగం మారలేదు. ఇది అమలు జరిపి తీరవలసిందే గాన తక్కువ జీతాలు పొందు వారందరూ తమ గ్రేడు జీతాలు అమలుజరుపమని కోరుకోవలసియుంది.

ప్రశ్న: "సెకండరీ గ్రేడు ట్రెయినింగు పూర్తిచేసి ఇంటర్ ప్యాసై యున్నవారందరూ ఇంటర్ ట్రెయినింగ్ స్కేలు కోరవచ్చా?"

జవాబు: తెలంగాణా ప్రాంతంలో వున్న ఇంటర్ ట్రెయినింగ్ ఆంధ్ర ప్రాంతములోలేదు. అయితే ఆంధ్ర ప్రాంతంలో సెకండరీ గ్రేడు ట్రెయినింగ్ పూర్తిచేసిన తర్వాత ఇంటర్ ప్యాసైన వారందరూ ఆది అదనపు జీతం [illegible]. ఇది సెకండరీ గ్రేడు స్కేలుకే అదనపు విద్యార్హతలకు నిర్ణయించిన భాగం గాన ప్రభుత్వం తప్పక అమలు జరుపవలసియున్నది.

ప్రశ్న: స్కేలులో స్టేజికి వచ్చినాక, సరిపోవచ్చిన వారుకూడా పై స్టేజికి పోవలెనా?

జవాబు: జి. ఓ. నెం. 1044 జి. ఓ. 5 (a) భాగంలో వివరంగా ఉదహరించబడియుంది. కనుక పై స్టేజీకి పోవలసియేయుంది.

ప్రశ్న: "సర్వీసు పోస్టు, గ్రేడు, స్కేలులతో సంబంధంలేకుండా తీసుకొందురా? లేక ఏది అధారంగా తీసుకొందురు?

జవాబు: జి. వో 5 (b) లో గ్రేడువారీ సర్వీసు తీసుకోబడునని యున్నది. అయితే ఉపాధ్యాయుల విషయంలో ఒకే గ్రేడు కలిగియుండి ఎలిమెంటరీ హైస్కూలులలో, వేరు వేరు స్కూళ్ళలో పనిచేసిన సర్వీసు అంతా పరిగణింపవచ్చునా? లేదా? అన్న విషయం ప్రభుత్వం తేల్చాలి.

ఒకసారి వ్రాసి పంపినవారు అవసరపడితే మళ్ళీచేసుకుంటూ తిరిగి వ్రాసి పంపవచ్చు. అయితే అది ఆగస్టు ఆఖరులోగానే వ్రాసి పంపుకోవాలి.

ప్ర. సో. పార్టీనుండి బెంగాల్ శాసనసభ్యుని రాజీనామా

ఆహార సమస్యలో ఆపార్టీ నాయకత్వం అనుసరిస్తున్న విధానానికి నిరసనగా

కలకత్తా, ఆగస్టు 25

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అనుసరించుతున్న ఆహార విధానంపట్ల ప్రజాసోషలిస్టుపార్టీ వైఖరిని నిరసించుతూ శాసనసభ్యుడూ, కలకత్తా మాజీ మేయర్ అయిన శ్రీ సుధీర్ చంద్రరాయిచౌదరి ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా యిచ్చారు.

ఆయన ఒక ప్రకటన చేస్తూ యిలా అన్నారు:

దొంగ వ్యాపారస్తులకూ, అధిక లాభాలను గుంజే వర్తకులకూ సన్నిహితమైన మిత్రుడుగా ముఖ్యమంత్రి డాక్టర్ బి. సి. రాయ్ అసలుస్వభావం మరోసారి బట్టబయలైంది. ఈ రాష్ట్రంలో ఆయన ప్రభుత్వం దాదాపు కరువు పరిస్థితులను సృష్టించింది.

చౌకగా తిండి గింజలను అందించాలని కోరుతున్న ప్రజలపై ప్రభుత్వం దారుణమైన నిర్బంధ విధానాన్ని ప్రారంభించింది. ఉద్యమం అత్యంత శాంతియుతంగానే వుంది. ప్రభుత్వాన్ని కూలద్రోయాలనేది ఆ ఉద్యమం లక్ష్యం కాదనేది అందరికీ తెలిసిందే. అయినప్పటికీ అసలు ఉద్యమం ప్రారంభంకాకముందే అతి దారుణమైన నిర్బంధ విధానాన్ని ప్రారంభించింది. వామపక్షాలకు చెందిన 250 మంది నాయకులను, కార్యకర్తలను డిటెన్షన్ చట్టంక్రింద అరెస్టు చేశారు.

ఆగస్టు 15 వ తేదీన డాక్టర్ బి. సి. రాయ్ ఒక ప్రకటన చేస్తూ బాధ్యత కలిగినవారు శాసనాన్ని ఎలా నిగ్రహించగలరని ప్రశ్నించారు. పాపం ఆయన తన నాయకుడైన పండిత నెహ్రూ చెప్పిన కేరళను గురించి శ్రీ నెహ్రూ చెప్పిన విషయాన్ని మరచిపోయినట్లున్నారు. కేరళను గురించి శ్రీ నెహ్రూ మాట్లాడుతూ ప్రజాతంత్ర వ్యవస్థలో కూడా ఎన్నికైన ప్రభుత్వాన్ని త్రోసిపుచ్చడానికి ప్రతిపక్షాలకు హక్కుగలదని చెప్పారు. ప్రస్తుతం ఆహార సమస్యపై ఈ రాష్ట్రంలో జరుగుతున్న ఉద్యమానికి ప్రభుత్వాన్ని కూలద్రోయాలనే లక్ష్యం లేనేలేదు. అయినప్పటికీ కాంగ్రెసు నిరంకుశత్వం కార్యాచరణకు పూనుకున్నది.

ఈ సందర్భంలో నేను రాష్ట్రంలో ప్రజాసోషలిస్టు పార్టీ నాయకత్వం అనుసరించుతున్న వైఖరిని తీవ్రంగా నిరసించక తప్పదు. వామ పక్షం అని చెప్పుకొంటున్న ఒక పార్టీ నాయకుడు బాధ్యతలేనిదైన, అభివృద్ధి నిరోధకమైన ప్రభుత్వానికి అధినేతగా వున్న డాక్టర్ బి. సి. రాయ్‌తో కలిసి ఎలా సంయుక్త ప్రకటన చేశారో నాకు ఆశ్చర్యంగా వుంది. శాంతియుత సంఘవ్యాపారాలను కాపాడి, ప్రజా సంఘటితను, దారుణ నిర్బంధవిధానానికి ప్రాతిపదికగా వున్న ప్రకటనకు ఆయన ఎలా భాగస్వామి కాగలిగారో దురూహ్యంగా వుంది.

అందువలన గత్యంతరంలేక నేను ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా యిస్తున్నాను.

తమిళనాడ్‌లో బేరియం పరిశ్రమ

రు. 10 లక్షల ఖర్చుతో నెలకొల్పేందుకు తమిళ వ్యాపారికి కేంద్ర ప్రభుత్వంఅనుమతి

న్యూఢిల్లీ, ఆగస్టు 27

క్లోరేట్, కార్బొనేట్, క్లోరైడ్, నైట్రేట్, సల్ఫేట్ మున్నగు రసాయన పదార్థాలను తయారుచేసే బేరియం పరిశ్రమను నెలకొల్పడానికి తమిళనాడ్ వాణిజ్యవేత్త శ్రీ పి. ఎస్. బాలసుబ్రహ్మణ్యానికి భారత ప్రభుత్వం అనుమతి యిచ్చింది.

ఈపరిశ్రమను తమిళనాడ్‌లోని కోయంబత్తూర్ జిల్లాకు చెందిన పరిసీ వద్ద నెలకొల్పుతారు. ఈ పరిశ్రమ నిర్మాణానికి రు. 10 లక్షల ఖర్చు కాగలదని అంచనా. పశ్చిమజర్మనీ వ్యాపారసంస్థ సహాయంతో ఈపరిశ్రమను నెలకొల్పుతారు.

సంవత్సరానికి 8 వేల టన్నుల బేరియంపదార్థాలు ఉత్పత్తిఅవుతాయి. వీటిని రంగులు, ప్రేలుడు పదార్థాలలో వినియోగిస్తారు. పరిశ్రమను ఒక సంవత్సరంలో నెలకొల్పాలని అంచనా. ఇది నిర్మించబడ్డ తర్వాత ఏడాదికి 20 లక్షల రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆదా కాగలదు. ఇటువంటి పరిశ్రమ భారతదేశంలో ఇదొక్కటే.

భాక్రాడాంప్రమాదం పరిశీలనకై పార్లమెంటు సభ్యుల పయనం

నంగల్, ఆగస్టు 27

భాక్రాడాంకు జరిగిన ప్రమాదాన్ని స్వయంగా పరిశీలించే నిమిత్తం నేడు 18 మంది కాంగ్రెసు పార్లమెంటు సభ్యులు డాంవద్దకు బయలుదేరి వెళ్ళారు. ప్రమాద పరిశీలనకై పార్లమెంటు సభ్యుల జట్టును పంపించాలని, కాంగ్రెసు పార్లమెంటరీపార్టీ నీటి వసతులపై నియమించిన స్థాయీ సంఘం నిర్ణయించింది.

ఈ సమావేశంలో కేంద్ర ఇరిగేషన్ మంత్రి కూడా పాల్గొన్నారు.

ఈ జట్టుకు సర్దార్ ఇక్బాల్‌సింగ్ నాయకుడు. ఇందులో పంజాబు, కాశ్మీర్, రాజస్థాన్, హిమాచల ప్రదేశ్‌కు చెందిన పార్లమెంటు సభ్యులున్నారు.

విచారణ కమిటీ నియామకాన్ని గూర్చి విమర్శ

భాక్రాడాం ప్రమాదాన్ని గూర్చి విచారించడానికై ప్రభుత్వం నియమించిన కమిటీలో కేంద్ర జల విద్యుచ్ఛక్తికమిషన్ సభ్యుడు డా॥ ఎ. ఎన్. ఖోస్లాను, శ్రీ కన్వర్ సేన్‌ను కూడ చేర్చినందుకు పార్లమెంటు సభ్యులనేకులు ప్రభుత్వాన్ని విమర్శించారని తెలుస్తోంది. వీరిద్దరూ ప్రాజెక్టు ఇంజనీరింగు సలహాదార్ల బోర్డులో సభ్యులుగా వున్నారు కాబట్టి వీరు విచారణ కమిటీలో వుండరాదని పార్లమెంటు సభ్యులవాదం.

ఇప్పటికి వెలికి తీసిన సామగ్రి

నీటిలో పూర్తిగా మునిగిపోయిన సామగ్రిలో నేడు కొంత వెలికి తీశారు. ఇందులో కొన్ని పంపింగ్ సెట్లు, వెల్డింగ్ సెట్లు, జనరేటర్ స్టార్టర్ తీగ చుట్టలు వున్నవి.

కేబుల్ గ్యాలరీలో రెండు పెద్ద రంధ్రాలు తొలిచినందువల్ల విద్యుత్ కర్మాగారంలోని నీరు రానురాను తగ్గుతూన్నది. అందువల్ల, నీటిలో మునిగిన ఇతరసామగ్రి త్వరగా వెలికితీయవచ్చునని అనుకుంటున్నారు.

స్టార్టర్ తీగచుట్టలకు జరిగిన ప్రమాదం ఏమాత్రం వుంటుందో ఇప్పుడేచెప్పడానికి వీలులేదని విద్యుత్ కర్మాగారం సూపరింటెండింగ్ ఇంజనీయరు పత్రికలవారితో అన్నారు.

లావోస్‌కు కొలది రోజుల్లోనే అమెరికా సైనిక సరఫరాలు

వాషింగ్టన్, ఆగస్టు 27

లావోస్‌కు అమెరికా కొద్దిరోజుల లోనే తన సైనిక సరఫరాను తరలించగలదని అమెరికా విదేశాంగ శాఖ నేడొక ప్రకటనలో చెప్పింది.

రాజ్యసభ చర్చ

(1 వ పేజీ తరువాయి)

పార్టీల ప్రతినిధులతో సంప్రతింపులు జరగాలని కోరుతూ ఆ తీర్మానానికి అదనంగా కలపాలని కమ్యూనిస్టు సభ్యులు శ్రీ బసవపున్నయ్య, రాజబహదూర్ గౌడ్‌గార్లు సవరణ తీర్మానాన్ని ప్రతిపాదించారు. ధరల స్థిరీకరణ, ఆహారధాన్యాల్లో ప్రభుత్వ వ్యాపారం, ఆహారధాన్యాల్లో దొంగ వ్యాపారాన్ని అరికట్టడం, చౌకధరల్లో బియ్యాన్ని ప్రజలకు అందించడం, అన్ని పక్షాలతోనూ ఇతరరాజకీయపార్టీల సహకారాన్ని తీసుకోవడం - వీటిని పరిశీలనలోకి తీసుకోనిరావాలని వారు తమ తీర్మానంలో పేర్కొన్నారు.

డాక్టర్ పరిమళదత్త (కాంగ్రెసు-బెంగాల్) మాట్లాడుతూ ఇతర వస్తువుల ధరలు పెరిగాయిగాబట్టి తిండి గింజలధరలు పెరగడంకూడా సహజమే నన్నారు. నిత్యం కొరవడానికి భారత ప్రభుత్వం కూడా సిద్ధపడిందనీ, రాష్ట్రంలో ధరలు పెరగడానికి అది కూడా కారణమనీ ఆయన అన్నారు.

శ్రీ రోహిత్ దేవ (ప్ర. సో. - బొంబాయి) ప్రసంగిస్తూ ఆహార ధాన్యాల టోకువ్యాపారాన్ని ప్రభుత్వమే నిర్వహించాలన్న పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం టోకువ్యాపారస్థుల సహాయంతో అమలుజరపాలని ప్రయత్నించుతున్నదన్నారు. అసలీ పథకానికి వ్యతిరేకులైన వారి సహాయం తీసుకోవడంవల్లనే సహజంగా వారి ప్రయత్నం విఫలమైంది.

తగినయంత్రాంగంవుండాలి

మాజీ కార్మికమంత్రి శ్రీ ఖండూభాయి దేశాయి (కాంగ్రెసు - గుజరాత్) మాట్లాడుతూ అమలు జరపడానికి తగిన యంత్రాంగాన్ని ఏర్పరచుకోకుండానే ఆహార ధాన్యాల వ్యాపారాన్ని ప్రభుత్వం నిర్వహించాలన్న పథకం తలపెట్టబడిందన్నారు. ఆ యంత్రాంగాన్నే ఏర్పరచుకొనివుంటే ప్రస్తుత పరిస్థితి ఏర్పడివుండేది కాదన్నారు.

ప్రభుత్వమే ఆహార ధాన్యాల వ్యాపారాన్ని నిర్వహించాలన్న పథకం సిద్ధాంతరీత్యాపొరపాటు కానేకాదు మనది అభివృద్ధి చెందుతున్న ఆర్థిక విధానం. అందువలన ఏదో ఒకరకమైన కంట్రోలుండటం అవసరం. భూమిశిస్తును, ఇరిగేషన్ శిస్తును డబ్బురూపంలో కాకుండా వస్తురూపంలో తీసుకోవాలని ఈ సందర్భంలో నా సూచన. అప్పుడు అది కూడా ఒకరకమైన ప్రభుత్వ వ్యాపారమే కాగలదు అని ఆయనన్నారు.

శ్రీ జస్వంతసింగ్ (డెమోక్రాటిక్-రాజస్థాన్) ఆహారధాన్యాల వ్యాపారాన్ని ప్రభుత్వమే నిర్వహించాలన్న పథకాన్ని విమర్శించారు. ఈ పథకాన్ని చూసి తమరాష్ట్రంలోని ప్రజలంతా నవ్వుకుంటున్నారని ఆయన న్నారు.

శ్రీ బి. శివరావు (కాంగ్రెసు - మైసూరు) ఆహార మండలాల ఏర్పాటును విమర్శించారు. దక్షిణ మండలం ఏర్పాటువలన జరిగిన ప్రయోజనం శూన్యమన్నారు. దక్షిణ భారతంలో చేపలపరిశ్రమాభివృద్ధికి, మైనర్ ఇరిగేషన్ పథకాలకు శ్రీ పాటిల్ హెచ్చు దృష్టిని కేంద్రీకరించాలని ఆయన కోరారు.

శ్రీ టి. యస్. పట్టాభిరామన్ (కాంగ్రెసు - మద్రాసు) ఆంధ్ర, మద్రాసు రాష్ట్రాల్లోని ధాన్యం హెచ్చుగా కేరళకు పోవడంవలన ఆ రాష్ట్రాల్లో ధాన్యం ధరలు హెచ్చాయన్నారు. ఇప్పుడున్న ఆహారమండలాలను రద్దుచేసి, ఏ రాష్ట్రానికా రాష్ట్రాన్ని ప్రత్యేక ఆహారమండలం చేయవలసిందిగా ఆయన కోరారు. కేరళకు అవసరమైన తిండిగింజలను కేంద్రమే తాను దిగుమతిచేసుకొన్న దానినుండి సరఫరాచేయాలని సూచించారు.

శ్రీ దేవకీనందన్ నారాయణ (కాంగ్రెసు - బొంబాయి) మాట్లాడుతూ, ప్రభుత్వం బహిరంగమార్కెట్టునుండే ధాన్యాన్ని కొని నిల్వచేసి ఆ కరువుకాలం చౌకరేట్లకు ప్రజలకు అందియాలన్నారు. అప్పుడే ప్రభుత్వానికి స్థిరమైన వనరు ఏర్పడి వ్యాపారుల దోపిడీని అరికట్టేందుకు వీలవుతుందన్నారు.

ఆహార సమస్యపై చర్చ రేపుకూడా కొనసాగుతుంది.

* * *

"దేశాల మధ్య శాంతి స్థాపనకు కృషి చేసినందుకు" గాను గ్రీక్ రచయిత వార్నాలిస్‌కు అంతర్జాతీయ లెనిన్ బహుమతి లభించింది.

కేరళ ఎన్నికలఖర్చు కేంద్రమే భరించాలి

లోక్‌సభలో కమ్యూనిస్టు సభ్యుని సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 27

కేరళకు సంబంధించిన అనుబంధపు పద్దులను గురించి నేడు లోక్‌సభలో చర్చ జరిగిన సందర్భంలో కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ టి. కె. యస్. మీనన్ మాట్లాడుతూ ఇప్పుడు జరపబోయే కేరళ ఎన్నికలకు అయ్యే 15 లక్షల ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరించాలని కోరారు. కేరళకు అసలే ఆదాయం తక్కువ. కాబట్టి అదనపు భారాన్ని దానిపైన వేయడం తగదన్నారు. అదీగాక ఈ ఎన్నికలు జరపాలన్న నిర్ణయం కేంద్రానిదే గాబట్టి అది భరించడం సబబన్నారు.

కేరళలో జన్మదిన సర్టిఫికెట్లు యిచ్చే అధికారాన్ని కేథలిక్ మత గురువులకు యిచ్చారు. ఇప్పుడు వారు రాజకీయాల్లో బాగా పాల్గొంటున్నారు. కాబట్టి క్రైస్తవులలో వోటర్ల సంఖ్యను పెంచేందుకు గాను యువతీ యువకుల వయస్సును హెచ్చించి సర్టిఫికెట్లు వ్రాసి యిచ్చే ప్రమాదం వుంది. అందువలన అసలు జన్మదిన తేదీలను చూడకుండా క్రైస్తవ మత గురువులు యిచ్చే సర్టిఫికెట్లతో వోటర్ల జాబితాలు తయారుచేయరాదని శ్రీ మీనన్ హెచ్చరిక చేశారు.

రాష్ట్రపతి పరిపాలనను కేరళ పెట్టిన తరువాత వెనకబడిన తరగతులకు చెందిన ముగ్గురు డిప్యూటీ పోలీసు సూపరింటెండెంటులకు ఘోరమైన అన్యాయం జరిగిందని శ్రీ మీనన్ చెప్పారు. వీరి ముగ్గురిని కమ్యూనిస్టు మంత్రివర్గం పై పదవులకు ప్రమోట్ చేయగా ఆందోళన కారులను సంతృప్తి పరచేందుకు ప్రస్తుత ప్రభుత్వం వారిని తరల క్రిందిపదవులకు తగ్గించిందన్నారు.

న్యాయమూర్తుల నియామకం

రాజకీయ, కులమతవిచక్షణ పనికిరాదం లోక్‌సభ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 27

న్యాయమూర్తులను రాజకీయ, కుల, మత ప్రాతిపదికల ననుసరించి నియమించరాదన్న లా కమిషన్ హెచ్చరికను ప్రభుత్వ దృష్టికి తీసుకోవాలని నేడు లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యుడు శ్రీ రామకృష్ణగుప్త కోరారు.

న్యాయ నిర్వహణశాఖలో తీసుకొని రావలసిన సంస్కరణలను గురించి లా కమిషన్ నివేదికపై చర్చను ప్రారంభిస్తూ శ్రీ గుప్త కార్య నిర్వహణ శాఖను న్యాయ నిర్వహణశాఖ నుండి పూర్తిగా వేరుపరచాలని కోరారు.

శ్రీ టి సి యన్ మీనన్ (కమ్యూనిస్టు - కేరళ) మాట్లాడుతూ వలస ఫ్యూడల్ వ్యవస్థలో వున్న మన సమాజాన్ని శాంతియుతంగాను, ప్రజాతంత్ర యుతంగానూ, సోషలిస్టు సమాజంగా మార్చాలంటే ఇందుకు న్యాయశాఖ పాత్ర ఎంతగానోతోడ్పడుతుందన్నారు. అయితే చట్టాలను శాసనాలను సరిగా నిర్వహించడంలోనే అసలు విషయం యిమిడివున్నదన్నారు. పార్లమెంటు చేసిన శాసనాల ఉద్దేశాన్ని గమనించి న్యాయమూర్తులు తగువిధంగా తీర్పుల నివ్వడం అవసరమన్నారు.

న్యాయమూర్తులను నియమించే సందర్భంలో రాజకీయ విచక్షణను పాటించడం తగదని శ్రీ మీనన్ విజ్ఞప్తి చేశారు.

శ్రీ సుబిమాన్ ఘోష్ (ఫార్వర్డు బ్లాకు-మార్కిస్టు-బెంగాల్) ప్రభుత్వ నిర్వహణ శాఖనుండి న్యాయశాఖను పూర్తిగా వేరుపర్చడం మొదటి కర్తవ్యంగా వుంచుకోవాలన్నారు. ఈ పనిముందు జరగాలన్నారు.

శ్రీ బి సి కాంబ్లే (స్వతంత్ర-బొంబాయి) హైకోర్టు న్యాయమూర్తుల నియామకంలో గవర్నర్లకు అధికారం వుండాలన్నారు.

బొంబాయిరాష్ట్ర విభజన సమస్య

బొంబాయి, ఆగస్టు 27

బొంబాయిరాష్ట్రాన్ని భాషాప్రాతిపదికపై విభజించాలని కేంద్రం నిర్ణయించినట్లు వ్యాపిస్తున్న పుకారులను గూర్చి తానేమీ చెప్పదలచుకోలేదని బొంబాయి ముఖ్యమంత్రి శ్రీ చావన్ నేడు పత్రికలవారితో అన్నారు.

నేడు శ్రీ చావన్ ఇంట్లో మంత్రివర్గ సమావేశం జరిగింది. సమావేశం తరువాత పత్రికలవారు, బొంబాయి రాష్ట్ర విభజనమాట నిజమా అని అడగ్గా "నేను చెప్పేదేమీలేదు" అని సమాధానమిచ్చారు.

శ్రీ చావన్ రేపు నాగపూరుకు వెళ్లుతున్నారు.

కావలెను

పైదలను, గృహములను క్రిముల సంహరించు మా 'ప్లెక్స్' మార్కు ఇన్‌సెక్టిసైడ్సు అమ్మకమునకు ఏజెంట్లు, స్టాకిస్టులు కావలెను. ఇంగ్లీషులో వ్రాయుండి.

MULTIPLEX

Post Box No. 1613, Bombay - 1

నవోదయ

పక్షపత్రిక

శ్రీయుతులు, ఆరుద్ర, దాశరథి, కొడవటిగంటి, గోరాశాస్త్రి, ప్రతాప రామసుబ్బయ్య మొదలైనవారి రచనలతో సెప్టెంబరు ఒకటికి మొదటి సంచిక వెలువడుతుంది

సంపాదకులు : డా॥ డి. కృష్ణమూర్తి, దండమూడి మహీధర్

ఇతర వివరాలకు :

పో. బా. నెం. 239, హైదరాబాద్-1

శూలహారిణి

పరిణామ శూలలకు లేక కడుపు నొప్పులకు ప్రసిద్ధిగాంచిన దివ్యౌషధము. పై వ్యాధిఎన్నిసంవత్సరముల నుంచి యున్ననూ, ఎంత సోడాఉప్పు సేవించియున్ననూ, ఏ వయస్సులో యున్ననూ అపరేషన్ లేకనే బాగుచేయబడును.

15 రోజుల మందు ఖరీదు రు 20/- ముందుగా రు 5/- అడ్వాన్సు పంపవలెను.

అనుభవ వైద్యశాల.

హెడ్ ఆఫీసు : నెల్లూరు.

బ్రాంచి : 177. గోవిందప్ప నాయక్ వీధి. మద్రాసు—1

స్టాకిస్టులు : జ్యోతి మెడికల్ హాల్ గవర్నరుపేట, విజయవాడ.

గుడివాడ హనుమంతరావు, తెనాలి.

వర్ధనాల మెడికల్ స్టోర్ గుంటూరు



తయారు చేయువారు :

జెరార్డ్ ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీస్

38, మింట్ స్ట్రీట్, మద్రాస్ - 3.

అథరైజ్డ్ డీలర్లు:

రాఫూస్ రేడియో మార్ట్

స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు.

గోలి భీమారావు

మెయిన్‌రోడ్, తెనాలి.

ఆంధ్రప్రదేశ్

పబ్లిక్ వర్క్సుశాఖ, నెల్లూరు

పని పేరు : చిత్తూరుజిల్లా, కాయల్పాడు తాలూకా పింఛానది రేవుకు అడ్డముగా అనకట్టుకట్టుట, మరియు అగ్రహారం పెద్ద చెరువు కాలువ త్రవ్వుట.

సూపరింటెండింగు ఇంజనీరు కార్యాలయంలో 15-9-59 తేదీ సా॥ 4 గంటలవరకు పై పనికి క. 2 ఫారములో సీలువేసిన టెండర్లు తీసుకొనబడును.

టెండరు డాక్యుమెంట్ల ఖరీదు రూ 10-20 న. పై.

టెండరు డాక్యుమెంట్లుకోరుటకు ఆఖరు తేదీ 5-9-59.

టెండరుధరావతు సుమారు రు 4,500

అదనపు డిపాజిటు సెక్యూరిటీ రు 4,500.

మీర్ బహీయుద్దీన్ అహమద్‌ఖాన్,

సూపరింటెండింగ్ ఇంజనీరు,

నెల్లూరు సర్కిల్, నెల్లూరు

ఆదోని నీటి సరఫరా పథకం

రు. 29 లక్షలు మంజూరు

హైదరాబాదు, ఆగస్టు 27

ఆదోని మంచినీటిసరఫరా పథకాన్ని రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పథకానికి 28 లక్షల 94 వేలు ఖర్చవుతుంది. ఇందులో రెండో ప్రణాళికా కాలంలో 18 లక్షల 89 వేలు ఖర్చు చేస్తారు.

ఆదోనిలో నీటిఎద్దడి తీవ్రంగా వున్నదనీ, ఈ విషయమై అక్కడి పౌరులు చాలాకాలంగా ఆందోళన చేస్తున్న విషయం పాఠకులకువిదితమే. తుంగభద్ర దిగువకాల్వనుండి గొట్టాల ద్వారా ఆదోని పట్టణానికి నీరందించడం అత్యవసరమని ఆదోని మున్సిపాలిటీ కూడా రాష్ట్రప్రభుత్వానికి తెలియజేసింది.

ఈ పథకాన్ని పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగు శాఖవారు అమలుజరుపుతారు.

రేడియో

ఆదివారం, ఆగస్టు 30

విజయవాడ

ఉదయం: 6-30 శుభోదయం; 6-40 భక్తిరంజని; 7-0 తె. వా; 7-15 'సుప్రభాతమ్' సంస్కృతకార్యక్రమం (మద్రాసు నుండి రిలే); 7-30 బాలమురళీకృష్ణ త్యాగరాజ కీర్తనలు; 7-45 సంగీత శిక్షణ; 8-0 ఆం. వా; 8-15 హిం. వా; 8-30 బాలవల్లి - చిన్నపిల్లల కార్యక్రమం; మధ్యాహ్నం: 12-30 శకుంతలా ఆనందరావు; 1-0 కంభంపాటి లక్ష్మీనారాయణశాస్త్రి వయొలిన్: 1-50 తె. వా; సాయంత్రము : 6-0 స్థానిక ప్రకటనలు; 6-5 ప్రాం. వా; 6-15 గ్రామస్థులకు; 7-0 తె. వా; 7-15 గ్రామస్థులకు; 7-30 ఉదయవేళలో వరి- శ్రోతల ఉత్తరాలకు జవాబులు; 7-40 నిస్సార్ హుస్సేన్‌ఖాన్; 8-0 లలిత సంగీతం; 8-45 టి. పి. సుబ్రహ్మణ్యపిళ్ళై; నాదస్వరం; 9-0 ఆం. వా; 9-15 లలిత సంగీతం; 9-30 కంభంపాటి లక్ష్మీనారాయణశాస్త్రి : వయొలిన్: 10-0 భక్తిరంజని; 10-30 సమాప్తి

హైదరాబాద్ - (బి)

ఉదయం : 6-30 సుప్రభాత్; 8-45 టి. టి. సిక; మధ్యాహ్నం : 12-30 ఇంద్రధనస్; 2-0 శాస్త్రీయ సంగీత్; 2-20 బాలవినోదం - పిల్లల కార్యక్రమం; సాయంత్రం : 6-0 స్థానిక ప్రకటనలు 6-15 గ్రామస్థులకు; 7-0 తె. వా; 7-15 గ్రామస్థులకు; 7-30 టి. టి. సిక; 8-0 చిత్రసీమ: 9-15 డి. సుశీల: లలిత్ సంగీత్; 10-30 సమాప్తి.

బజారు ధరలు

విజయవాడ, ఆగస్టు 28

[మధ్యాహ్నం గం॥ 1 వరకు]

బంగారం ధరలు		
మేలిమి : పాత		128 0 0
మారు		122 0 0
నవరసు		80 8 0
వెండి : 100 తులములు		202 0 0
రూపాయి		2 1 0
ధాన్యం ధరలు		
24 నెంబరు		రు. 31 0 0
సంకరన్నాలు		29 0 0
12 నెంబరు		27 8 0
అక్కుళ్ళు		26 8 0
కేసులు		27 0 0
బియ్యం ధరలు		
24 నెంబరు		రు. 73 0 0
సంకరన్నాలు		68 0 0
12 నెంబరు		64 0 0
అక్కుళ్ళు		68 0 0
కేసులు		62 0 0
అపరాల ధరలు		
సెనగలు 240 శేర్లు		56 0 0
కందులు	45/-	50 0 0
నల్ల సెనగలు (మాగాణి)		53 0 0
పచ్చ సెనగలు 280 శేర్లు		49 0 0
పచ్చ సెనగలు (మెట్ట)		48 0 0
మినుములు (తెల్లవి)		48 0 0
మినుములు (నల్లవి)		34 8 0
ధనియాలు 28 [illegible]	60/-	63 0 0
పులగం	39-0-0	42 0 0
ఆముదాలు		42 8 0
కంచకారి (పురుగులు)		114 0 0
కొబ్బరి మామిడికాయ		37 12 0
నల్లబెల్లం మణుగు		10 0 0
బెల్లం ,,	6-8-0	9 0 0
చింతపండు ,,	28-0-0	27 0 0
పసుపు ,,	2-4-0	2 6 0
అంతకంతు ,,	9-0-0	14 12 0
నువ్వులనూనె ,,		36 8 0
వేరుశనగపప్పు 177 శేర్లు		
జర్దాయిల్		63 8 0
గోదావరి		64 8 0
మూల మణుగు		18 2 0
కిరోసిన్ 160 శేర్లు		28 0 0
కొబ్బరికాయలు 1000 పాతవి		241/-282
పంచదార 100		98 8 0
మీనా ఖాకర		91 12 0
కర్పూరం 2 పట్లు		9 8 0
,, 3 ,,		11 8 0
బెల్లం	6-8-0	9 0 0

తీవ్రరూపం దాల్చిన ఆహార సమస్య

మెదక్ జిల్లా సిద్దిపేటలో ప్రజల పస్తులు

సిద్దిపేట, ఆగస్టు 26

ఆహారసమస్య రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతుండటంతో మెదక్ జిల్లా సిద్దిపేట పట్టణ, గ్రామీణ ప్రజలు ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, నేత, మధ్యతరగతి ప్రజలజీవితం దుర్భరమవుతున్నది. ఈ సంవత్సరంకూడా అతివృష్టి, అనావృష్టివల్ల పంటలు పూర్తిగా దెబ్బతినటంవల్ల ప్రజల్లో పెద్ద ఆందోళన బయలుదేరింది. పట్టణంలోను, గ్రామాలలోను ధాన్యం నిల్వలువున్న షావుకార్లు సేకరించి అయినా కూడా ఇవ్వటంలేదు. గ్రామాల్లో ప్రజలు పస్తులు వుంటున్నారు.

సిద్దిపేట తాలూకాను కరవు ప్రాంతంగా ప్రకటించి, ప్రజలకు కరవుపనులు కల్పించాలని శాసనసభ్యులు శ్రీ అనంతరెడ్డిగారు ఒక ప్రకటన చేశారు.

సిద్దిపేట న్యాయవాదులు శ్రీయుతులు విశ్వనాథం, యూనుసుద్దీన్ మహమ్మద్ సుల్తాన్, మహమ్మదు అఫీజ్, సి. నర్సింహారెడ్డి, మహబూబలీ, అబ్దుల్ రజాక్, నారాయణరావు యూనుసుద్దీన్ బాబూఖాన్, నర్సు నారాయణరెడ్డి, అబ్దుల్ కరీం, అసగర్ అలీ (కార్యదర్శి, టాగూర్ సొసైటీ) గార్లు, మున్సిపల్ కౌన్సిలర్లు ఆహార సమస్యపై కలెక్టరుకు ఒక విజ్ఞాపన పత్రం పంపించారు. కొందటిరకం బియ్యం (సాంబలు) 12 శేర్లు రు 8/- పైగా అమ్ముతున్నారని, ప్రభుత్వం చౌక డిపోలు పెట్టి రూపాయకు 2½ శేర్ల బియ్యం, 4 శేర్ల జొన్నలు చొప్పున అమ్మించాలని కోరారు.

పారిశ్రామిక సంఘాల తీర్మానం

ఆహార ధాన్యాల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నందులకు తమ ఆందోళనను ప్రకటిస్తూ వెంటనే చౌకడిపోలు పెట్టించి రూపాయికి 2½ శేర్ల బియ్యం, 4 శేర్ల జొన్నల చొప్పున సప్లయిచేయాలని కోరుతూ సిద్దిపేట, చేనేత, బట్టునేత, ఇతర పారిశ్రామిక సంఘాల ప్రతినిధుల సమావేశంలో తీర్మానించారు. తీర్మానం ప్రతిని జిల్లా కలెక్టరుకు పంపించారు.

తాలూకా రైతుసంఘ కార్యదర్శి శ్రీ యం. సిరాజుద్దీన్‌గారు ఆహార సమస్యను జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ పి. వి. రాజేశ్వరరావు (ఎం.ఎల్.ఎ.) గారి దృష్టికి తీసుకరాగా, ఆయన పరిస్థితులు ఆందోళనకరంగా వున్నట్టు తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

తాలూకా రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు తమ ఆందోళనను ప్రకటించాయి తాలూకా కమ్యూనిస్టు పార్టీ ఆహార సమస్యపై తీర్మానంచేసి యింతకుముందే జిల్లా కలెక్టరుకు పంపింది.

ఆహార ధాన్యాల ధరలు రోజురోజుకు పెరిగి పోతున్నందుకు తమ ఆందోళనను వ్యక్తపరుస్తూ సిద్దిపేట పట్టణ కమ్యూనిస్టుపార్టీ సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు సభకు శ్రీ అనంతరెడ్డి (ఎం. ఎల్. ఎ.) గారు అధ్యక్షతవహించారు.

తీర్మానం ప్రతిని జిల్లాకలెక్టరుకు పంపించారు.

పట్టణంలో ఆహార వారోత్సవం జరపాలని ప్రతివార్డులో సభలు పెట్టాలని నిర్ణయించుకున్నారు.

ఆకలి యాత్రా సన్నాహాలు

వెంకటగిరి, ఆగస్టు 25

నెల్లూరుజిల్లా వెంకటగిరి తాలూకా కమ్యూనిస్టు కమిటీ సమావేశం ఆగస్టు 19న శ్రీ ఎన్. వి. కృష్ణమూర్తిగారి అధ్యక్షతను జరిగింది.

జిల్లాపార్టీ నాయకులు శ్రీ సి. వి. సుబ్బయ్యగారు నేటి ఆహార పరిస్థితిని సమీక్షించారు.

స్థానికాధికారుల వద్దకు 31 ఆకలి యాత్ర తీయాలని నిర్ణయించారు.

బందరు రోడ్‌రవాణా కార్మికుల సమావేశం

బందరు, ఆగస్టు

బందరుడిపోలో పనిచేస్తున్న రోడ్ రవాణా కార్మికుల యూనియన్ సమావేశం శ్రీ పి. వెంకటేశ్వరరావు గారి అధ్యక్షతను జరిగింది.

యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీ వై. వి. రావుగారు సమ్మెను వాయిదా వేయడానికి గల కారణాలను వివరించారు. కార్మికులు ఐకమత్యంతో ఉండి, సెప్టెంబరు 10వ తేదీన జరుగనున్న సమ్మె జయప్రదంగా నిర్వహించాలని కోరారు

జిల్లా మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్సు యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ అబ్దుల్ రహీంగారు ఈ సమావేశంలో పాల్గొన్నారు

వచ్చే జనరల్ ఎన్నికల్లో గుర్తింపు కార్డుల పద్ధతి

పట్టణప్రాంతాల్లో అమలు

న్యూఢిల్లీ, ఆగస్టు 27

వచ్చే జనరల్ ఎన్నికల్లో, పట్టణ ప్రాంతాల్లో, ఓటర్లకు గుర్తింపు కార్డులిచ్చే పద్ధతి ప్రవేశ పెట్టబడుతుందని, నేడు లోక్‌సభలో న్యాయశాఖా మంత్రి శ్రీ ఎ. కె. సేన్ చెప్పారు.

గతంలో పట్టణ ప్రాంతాలలోనే ఎక్కువగా దొంగ ఓట్లు వేసినట్లు శ్రీ సేన్ చెప్పారు.

శ్రీ యస్. ఆర్. యస్. స్వామి ప్రశ్నకు జవాబుచెబుతూ శ్రీ సేన్ గుర్తింపు కార్డుల పద్ధతి ఏ పట్టణాల్లో ప్రవేశపెట్టేదీ ఎలక్షన్ కమీషన్ నిర్ణయిస్తుందన్నారు.

దొంగ ఓట్లు వేసినట్లుగా సమాచారం వచ్చిందనీ, కాని ఆ దొంగఓట్ల పద్ధతి ఏ స్థాయిలో జరిగిందీ చెప్పడం కష్టమనీ ఆయన చెప్పారు. కేరళలో దేవికుళం ఉపఎన్నిక జరిగిన తరవాత, ఇట్టి పద్ధతి జరిగినట్లు సమాచారం అందిందని ఆయన చెప్పారు.

శ్రీ బెనర్జీ: కలకత్తా ఉపఎన్నికలో అలస్యం జరగడానికి గుర్తింపు కార్డు లివ్వడంలో అలస్యమే కారణమా?

న్యాయశాఖామంత్రి శ్రీ సేన్ : ఓటర్ల జాబితాలో చాలా తప్పులుండడంవలన అక్కడ అలస్యం జరిగింది. చాలమంది ఓటర్లు ఆ నియోజకవర్గం నుండి వెళ్ళిపోయినా, వారి పేర్లు జాబితాలో ఉన్నాయి. అదే విధంగా ఎంతోమంది కొత్తవారు ఆ నియోజకవర్గంలో నివసిస్తున్నారు. వారికి ఓట్లులేవు నియోజకవర్గంలో ఓటర్ల జాబితాను పునఃపరిశీలన చేయవలసిదిగా ఇప్పుడు [illegible].

శ్రీ బెనర్జీ: ఫొటో తీయించుకునేందుకు కొంతమంది స్త్రీలు అభ్యంతరం చెప్పలేదా?

మంత్రి: నేనపుడక్కడేవున్నాను. చాలమంది స్త్రీలు, మంచిమంచిచీరలు కట్టుకొనివచ్చి ఉత్సాహంతో ఫొటో తీయించుకున్నారు.

నైరుతి కలకత్తా పార్లమెంటరీ నియోజకవర్గ ఓటర్లసంఖ్య 3 లక్షల 80 వేలనీ, ఈ ఓటర్లకు గుర్తింపు కార్డులను యివ్వడానికైన ఖర్చు 3 లక్షల 60 వేల రూపాయలని మంత్రి తెలియజేశారు. ఈ ఖర్చులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరిస్తాయన్నారు.

బొంబాయి విభజనపై చర్చలు

బొంబాయి, ఆగస్టు 27

గతవారంలో బొంబాయి ముఖ్యమంత్రి ఇక్కడకు వచ్చినప్పుడు బొంబాయి విభజనసమస్యపై చర్చలు జరిగాయి. ఇప్పుడు మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాల పార్లమెంటు సభ్యులుకూడా ఈ చర్చల హడావుడిలో నిమగ్నమై ఉన్నారు. ఇంతవరకు సంభాషణలు ప్రాథమిక దశలోనే ఉన్నట్లు చెబుతున్నప్పటికీ బొంబాయి ద్విభాషా రాష్ట్రాన్ని విభజించాలన్న సమస్యే ప్రధాన చర్చనీయాంశంగా ఉంది.

బొంబాయి మాజీ ఆర్థికమంత్రి శ్రీ కందూభాయి దేశాయ్ నేడు హోంమంత్రి శ్రీ మొరార్జీని కలుసుకున్నారు.

శ్రీ మొరార్జీ బొంబాయి మంత్రులతో సంభాషణలు జరిపి ఇక్కడికి [illegible] వచ్చారు.

విదర్భ ప్రాంత నుండి పార్లమెంటుకు ఎన్నికైన సభ్యులు శ్రీ ఆనే, శ్రీ జంగ్డే, శ్రీ దేశ్‌ముఖ్ గార్లు నేడు కాంగ్రెస్ అధ్యక్షురాలిని కలుసుకొని ప్రత్యేక విదర్భ నిర్మాణం గురించి చర్చించినట్లు తెలుస్తున్నది.

టిబెట్‌కు వెళ్ళిన భారతీయ యాత్రికులు

క్షేమంగా తిరిగి రాక

ఆల్మోరా, ఆగస్టు 26

పశ్చిమ టిబెట్‌లోని కైలాసక్షేత్రాన్ని, మానససరోవరాన్ని సందర్శించడంకోసం వెళ్ళిన భారతీయ యాత్రికుల మొదటిబృందం క్షేమంగా టిబెటు సరిహద్దులు దాటినట్లు ఇక్కడికి వార్త వచ్చింది



శ్రీ తరిమెల రామదాసురెడ్డి

బొంబాయి విశ్వవిద్యాలయ విద్యార్థిసంఘ కార్యదర్శిగా ఆంధ్రుని ఎన్నిక

బొంబాయి, ఆగస్టు 25

బొంబాయి విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం కార్యదర్శిగా శ్రీ తరిమెల రామదాసురెడ్డిగారు ఎన్నికయ్యారు. ఈవిశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం కార్యదర్శిగా ఎన్నికైన మొదటి ఆంధ్రుడు ఈయనే. (వీరు శ్రీ తరిమెల నాగిరెడ్డి ఎం.పి. గారికి తమ్ముడు.)

విజయవాడ తాలూకాలో తక్కావీ అప్పులు

విజయవాడ, ఆగస్టు 27

శాసనసభ్యులు శ్రీ వెల్లంకి విశ్వేశ్వరరావుగారిలా వ్రాస్తున్నారు:

విజయవాడ తాలూకా కొండపల్లి ఫిర్కాలో ఎడ్ల నిమిత్తం తక్కావీ అప్పుల కొరకు రైతాంగం పిటీషన్లు పెట్టుకున్నారు. కాని అనేకమంది రైతుల లోన్ ఫారములపై గ్రామాధికారులు సర్టిఫై చేసినా, రెవిన్యూ ఇన్‌స్పెక్టరు, తహసీలుదారు కూడా సర్టిఫై చేయాలనే కారణంతో నిరాకరిస్తున్నారు. ఇబ్రహీంపట్టణం, సున్నంపాడు గ్రామాలలో పాత బకాయిలు వున్నవనే కారణంతో రెవిన్యూ అధికారులు సర్టిఫై చేయుటం లేదు. అందువల్ల రైతులనుభవిస్తున్న ఇబ్బందిని నిన్న విజయవాడలో వ్యవసాయశాఖామంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చాను.

గత సంవత్సరం అప్పులు పూర్తిగా చెల్లించిన వారందరికీ వెంటనే అప్పులు మంజూరు చేయవలసిందిగా మంత్రిగారు జిల్లా వ్యవసాయ శాఖాధికారికి సూచనలు యిచ్చారు. తక్షణం అందుకు అవసరమైన చర్యలు తీసుకోవలసిందిగా కూడా జిల్లా అధికారికి సలహా యిచ్చారు.

కాన విజయవాడ తాలూకాలో గత సంవత్సరం అప్పులు తీసుకుని చెల్లించిన రైతాంగమంతా తమ అప్లికేషన్లను గ్రామమునసబుల సర్టిఫికేటుతో జిల్లా వ్యవసాయశాఖాధికారిగారికి పంపించవలసిందిగా కోరుచున్నాను.

మునగపాక పంచాయితీ ఎన్నికలు

అనకాపల్లి ఆగస్టు 25

అనకాపల్లి తాలూకా మునగపాక పంచాయితీ ఎన్నికల్లో 7 గురు కమ్యూనిస్టులు, వారు బలపరచిన స్వతంత్రుడు ఒకరు, ఒక కాంగ్రెసు అభ్యర్థి గెలిచారు. కాంగ్రెసువారు స్వతంత్రులనే పేరుతో అన్ని స్థానాలకూ పోటీచేసి నాలుగు స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయారు.

ఎన్నికైనవారు: శ్రీయుతులు సన్యాసినాయుడు, దొరాల సూరి, అప్పారావు, లచ్చన్న, రమణ (శాసనపరిషత్తు సభ్యులు), జోగినాయుడు, నారాయణమూర్తి, చిన్నయ్య (కమ్యూనిస్టుపార్టీ బలపర్చిన అభ్యర్థి), జోగులు (స్వ) గార్లు.

దగ్గు రాకుండా
చేస్తే చాలదు
దగ్గు వచ్చే చోటునే
ఉపశమింప చేయాలి



బి ఐ కాఫ్ సిరప్
మొండి దగ్గులకు
కూడా మహా [illegible]

బి.ఐ
కాఫ్
సిరప్

బెంగాల్ ఇమ్యూనిటీ

డిపో సౌత్ ఇండియా కెమికల్ అండ్ బయలాజికల్ ఏజన్సీ మెయిన్ బజార్ - విజయవాడ - 1.

Have you had your Alvitone?

మీ కుటుంబమునకు అన్నివిధాలా పూర్తి ఆరోగ్యం, పుష్టి నిచ్చుటకు ఆల్విటోన్ సేవించండి. దీనిలో ఆల్మండ్, బార్లీ మాల్ట్, మీగడపాలు, కోకోలతో నిండి అదనంగా కాల్షియం, విటమిన్లతో తయారు కాబడినవేడి లేక చల్లని పానీయంగా వాడుటకు వీలైన అలసటతీర్చు పానీయం.

ALVITONE

పూర్తి ఆరోగ్యమిచ్చు ఆహార పానీయము

ఆల్విటోన్ లాబొరేటరీస్, మద్రాసు - 16

ఆంధ్ర ప్రదేశ్‌కు డిస్ట్రిబ్యూటర్లు

స్వతంత్ర ఏజెన్సీస్, గాంధీనగరం, విజయవాడ - 2



RITESHARP Pens SHORUPDEV BOMBAY 10

చీకటిలో మీ సహవాసి

ఎస్ట్రెలా బ్యాటరీలు



మీ బేటరీ లైటు నమ్మకముగా వెలుగుటకు ఎల్లప్పుడూ ఎస్ట్రెలా బేటరీ వుపయోగించండి అది చాలాకాలము వరకు ఎక్కువ ప్రకాశవంతమైన వెలుగునిచ్చును.

ఎస్ట్రెలా బేటరీస్ లిమిటెడ్

బొంబాయి - మద్రాసు - ఢిల్లీ - కలకత్తా - కాన్పూరు.

ASP HC 148



NORTON

నార్టన్ - పెర్ఫెక్టు పార్టులతో నిండివున్నది

నార్టన్ గొప్పతనం అంతయు పొందుపర్చిన పెర్ఫెక్టు పార్టులవల్లనే - బలిష్టమైన రిమ్ములు, భద్రత నిచ్చు సెంటర్ పుల్ బ్రేకులు, ప్రెసిషన్ - గ్రౌండ్ హబ్ కోనులు, సాఫీయైన నడక, సుఖము, మరియు బరువు తక్కువ, మన్నిక గుణము కల్గియున్నది.

HIND CYCLES LTD. 250 WORLI BOMBAY 18

అన్ని విధములా ఘనమైనది!

నేషనల్ ఎక్కో

'న్యూ ప్రముఖ్' మోడలు ఎ-731



శ్రావ్యమైన ధ్వని, సొగసైన ఆకారము, ఉత్తమమైన పనితనము ... యీ విశేషాంశములన్నీగల 'న్యూ ప్రముఖ్' రేడియోను మీ దగ్గరలోవున్న నేషనల్-ఎక్కో వ్యాపారివద్ద నేడే చూడండి!

7 వాల్వులు, 8 బ్యాండులు ఏసి సెట్. శ్రావ్యమైన ధ్వని, [illegible]

రు. 625.00 నెట్

స్థానిక పన్నులు అదనము

నేషనల్-ఎక్కో రేడియోలు శ్రేష్ఠమైనవి —

అవి మాగ్నావాక్స్ చేయబడినవి

జెనరల్ రేడియో & అప్లయెన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్

[illegible], బొంబాయి 1 • 3. [illegible], కలకత్తా 13 [illegible] రోడ్, పాట్నా • 1/18, [illegible] రోడ్, మద్రాసు 16/19, [illegible] రోడ్, బెంగుళూరు [illegible] రోడ్, ఢిల్లీ • [illegible] రోడ్, సికిందరాబాదు

కేంద్రప్రభుత్వ ఖర్చులో పెద్ద ఎత్తున దుబారా

పార్లమెంటు ఆమోదించిన పనులే అమలుజరగనట్లు ఆడిట్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 27

1957-58 సంవత్సరంలో కేంద్రప్రభుత్వానికి చాలా ఆర్థికనష్టాలూ, అవకతవకలూ, అనవసరపు ఖర్చులూ జరిగినవనీ, పెద్దఎత్తున దుబారా ఉన్నదనీ, ఆడిట్ నివేదికలో వెల్లడించారు.

1957-58 సంవత్సరంలో పార్లమెంటు ఆమోదించిన పథకాలూ, కార్యక్రమాలూ, ఇంచుమించు అమలు జరుపబడకుండానే ఉండిపోయాయని కూడా ఆడిట్ నివేదిక ఉపోద్ఘాతంలో ఆడిటర్-జనరల్ తెలియజేశారు.

ఈ నివేదికను లోక్‌సభలో నేడు ఆర్థిక మంత్రి శ్రీ మొరార్జీదేశాయి ప్రవేశపెట్టారు.

అందులో ఇంకా ఈ విధంగా ఉంది.

1957-58 సంవత్సరానికి ఆమోదింపబడిన 129 గ్రాంటుల్లో, 118 గ్రాంటుల కిందా డబ్బు నిల్వ ఉండిపోయింది. ఆమోదింపబడిన గ్రాంటుల మొత్తం ధనం 218 కోట్లు. ఈ ధనంలో, సంవత్సరం పూర్తికాక ముందే, 126 కోట్లను ఖర్చుకట్టకుండా తప్పజెప్పడం జరిగింది. తత్ఫలితంగా నిర్మాణంలో ఉన్న పెద్ద ప్రాజెక్టుల పని త్వరితంగా సాగడంకోసం ఆ డబ్బును తిరిగి కేటాయించడానికి వీల్లేకపోయింది. మొదటగా పనుల కొరతవలన ఆ ప్రాజెక్టులకు పెద్ద పెద్ద మొత్తాలను కేటాయించడానికి వీలులేక పోయింది.

అందువలన, పార్లమెంటు ఆమోదించిన పథకాలూ, కార్యక్రమాలూ ఇంచుమించు అమలు కాకుండానే ఉండిపోయినవని చెప్పేందుకు మిగిలిపోయిన ఈ నిల్వలే సాక్ష్యం.

ఈ సంవత్సర కాలంలో, ఆమోదింపబడిన 11 గ్రాంటుల మొత్తం 3 కోట్ల 86 లక్షలకాగా, కొన్ని సివిల్ పనుల కొరకు అదనంగా ఒక కోటి, 91 లక్షలు ఖర్చుపెట్టారు.

పర్లిమెంటరీ పద్దుల క్రింద కేటాయించిన 66 కోట్ల 50లక్షల్లోనూ, 8 పద్దుల గ్రాంటులలో 14 కోట్ల, 60 లక్షలూ అనవసరమే.

పరిపాలనా మంత్రిత్వ శాఖలకుగల అధికారాలను పెంచుతూ, బడ్జెటు పార్లమెంటరీ అంచనాల విధానాన్ని మారుస్తూ పబ్లిక్ అక్కౌంట్సు కమిటీ చేసిన సిఫారసులను దృష్టిలో పెట్టుకొని, ఆడిటర్ జనరల్ ఇంకా ఈ విధంగా నివేదించారు.

ప్రాజెక్టులు నిర్మించే ప్రాంతమూ, వాటి మొదటిదశ పథకాలు తప్పని తెలిసికూడా, వాటిని కొనసాగిస్తే లక్ష్యాలు విఫలమవుతాయని తెలిసికూడ ఆ ప్రాజెక్టులనూ, ఆ కార్యక్రమాలను కొనసాగించిన సందర్భాలున్నాయి. నిధులు మురిగిపోకుండా ఉండేందుకుగాను, మార్చినెలలో విచక్షణా రహితంగా నిధులు ఖర్చుపెట్టబడ్డాయి.

ఈ నిధులపైన అజమాయిషీగలవారు వ్యక్తిగత ఖర్చుల్లో పొదుపుగా వ్యవహరించాలన్నది ప్రథమ ఆర్థిక సూత్రం. కాని ఆ సూత్రాన్ని వారు ఎక్కువగా గౌరవించినట్లుకన్పించదు. ఈ సూత్రాన్ని పెద్దపెద్ద ప్రాజెక్టుల విషయంలో కూడా తప్పకుండా ఆచరించి ఉంటే, చెప్పకోదగినంత సొమ్ము మిగిలేది.

ఈ సంవత్సరం 55 దేశాలకు చెందిన 170 కార్మిక సంఘాల ప్రతినిధివర్గాలు సోవియట్ యూనియన్ సందర్శించాయి.

పబ్లిక్కు నోటీసు

సర్వులకు తెలియజేయునది ఏమనగా,

పోలవరం తాలూకా జంగారెడ్డి గూడెం కాపురస్తుడు కొండూరి సుబ్బయ్యగారి కు॥ శేషగిరిరావుగారి పేరను 2-9-58వ తేదీన రూ 5400/- వ్రాసియిచ్చిన ప్రొనోటు ఒకటి కలదు. ఆ నోటుక్రింద చాలా చెల్లుబడి యిచ్చియున్నాను. రశీదులు కలవు. కాక నోటు మొత్తంలో కూడ స్కొలు దవును కాజేసియున్నది. ఇవి పోను నిఖరం బాకీ యుండదు. ఇది మధ్యవర్తి వద్ద మోసబుచ్చి అక్రమమైన లాభములను పొందవలెనను దురుద్దేశముతో యితరులకు అది ట్రాన్స్‌ఫర్ చేయ సద్దేశించుచున్నాడని తెలియవచ్చినది. అట్లు ఎవరూ ట్రాన్స్‌ఫర్ చేసుకోకూడదనియు అందుకల్ల కలిగే నష్టములకు వారే బాధ్యులగుదురనియు యిందుమూలముగా అందరిని హెచ్చరించుచున్నాను.

కొచ్చెర్లకోట వెంకటసుబ్బారావు,
27-8 59, ఏలూరు.

గుంటూరులో 31 వ తేదీన బహిరంగసభ

శ్రీ సుందరయ్యగారి కార్యక్రమం

విజయవాడ, ఆగస్టు 27

ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ ప్రతిపక్ష నాయకులు శ్రీ సుందరయ్యగారు ఈనెల 31న గుంటూరు బహిరంగ సభలో ఉపన్యసిస్తారు.

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావుగారు ఈ నెల 31న, రేపల్లె ఆలియాత్ర కార్యక్రమంలో పాల్గొంటారు.

'ఎక్స్‌ప్రెస్ పత్రికల్లోని ఉద్యోగుల నిరశనవ్రతం

మదరాసు, ఆగస్టు 27

"ఎక్స్‌ప్రెస్ న్యూస్‌పేపర్స్" కంపెనీ యజమానులకు, ఉద్యోగులకు మధ్య ఏర్పడిన వివాదంలో కేంద్ర, మద్రాసు ప్రభుత్వాలు వెంటనే జోక్యం కలిగించుకొని, న్యాయంగా పరిష్కరించాలని కోరుతూ, 'ఎక్స్‌ప్రెస్' సబ్‌ఎడిటర్ శ్రీ భాస్కరం మోహన్, ప్రెస్ వర్కర్ శ్రీ వి. గోవిందస్వామి నేడు నిరాహారదీక్ష ప్రారంభించారు.

'ఎక్స్‌ప్రెస్ న్యూస్ పేపర్స్' కార్యాలయంముందు వీధిలో వేసిన ఒక పాకలో వీరు నిరాహారవ్రతం చేస్తున్నారు.

ఈ కంపెనీవారు మద్రాసునుండి ప్రచురిస్తూ ఉండిన 7 పత్రికలు, యజమానులు లాకౌట్ చేసిన ఫలితంగా, ఆగిపోయిన విషయం పాఠకులకు విదితమే.

సత్యాగ్రహులకు రేవు కార్మికసంఘ అధ్యక్షుడు శ్రీ ఎ. యస్. కె. అయ్యంగారు, మద్రాసు ప్రెస్ కార్మికసంఘ నాయకుడు శ్రీదీనదయాళు, హోటల్ కార్మికసంఘ నాయకుడు శ్రీహరిభట్టు పూలమాలలు వేశారు.

ఈ సందర్భంలో మద్రాసు పాత్రికేయులసంఘ ప్రధానకార్యదర్శి శ్రీ సి. యస్. చిత్తరంజన్ ప్రసంగిస్తూ, పాత్రికేయులకు, ప్రెస్ కార్మికులకు సానుభూతి తెల్పిన ప్రభుత్వం, సమ్మెను న్యాయంగా పరిష్కరించేందుకు పూనుకోకపోవడం విచారకరమనీ, ప్రభుత్వం యజమానులపై తగినంత ఒత్తిడి తేలేకపోతున్నదనీ అన్నారు.

ధరల పెరుగుదలకు నిరసనగా సమ్మె

ముఖ్యమంత్రికి ప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కార్యదర్శి లేఖ

హైదరాబాద్, ఆగస్టు 27

ఆంధ్రప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ సంస్థకు అనుబంధించిన కార్మిక సంస్థలన్నీ నానాటికీ పెరిగిపోతున్న ఆహారధరలకు నిరసనగా ఆగస్టు 31వ తారీఖున లాంఛన సమ్మె చేస్తారని, ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు కార్యదర్శి శ్రీ యస్. సత్యనారాయణరెడ్డి నేడు ముఖ్యమంత్రికి తెలియజేశారు.

అసాధారణంగా పెరుగుతూన్న అధిక ధరలవలన ప్రజలెదుర్కొంటున్న పరిస్థితులను చక్కదిద్దడానికి ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు చేసిన ప్రయత్నాలను వివరిస్తూ, శ్రీ సత్యనారాయణరెడ్డి ఇంకా ఈ విధంగా తెలియజేశారు.

5 జనుల కుటుంబాలకు ఒక చౌక డిపోచొప్పున స్థాపించి బియ్యం రూపాయికి 2½ శేర్లూ, జొన్న రూపాయకి 8½ శేర్లు అమ్మించాలనేది కార్మికుల ప్రధాన మయిన కోర్కె అని శ్రీసత్యనారాయణరెడ్డి అందులో తెలియజేశారు.

పోలీసు కాల్పులపై దర్యాప్తులు

దేశానికంతటికీ ఒకేపద్ధతి వుండాలని శ్రీ నంబూద్రిపాద్ సూచన

పాల్ఘాట్, ఆగస్టు 26

పోలీసు కాల్పులపై న్యాయవిచారణ జరిపించాలంటే యావద్భారతానికి ఒకేరకమైన విధానాన్ని అవలంబించడం అవసరమనీ, ఒక్క కేరళ విషయంలో, మాత్రమే వేరుగా వ్యవహరించాలని కోరడం సరికాదనీ కేరళ మాజీ ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ నేడిక్కడ పత్రికాగోష్ఠిలో అడిగిన ప్రశ్నలకు సమాధానంగా తెలియజేశారు.

కేరళలో కేథలిక్కులు రాజకీయ ప్రచారంలో పాల్గొంటూ రాజకీయాల్లో మతాన్ని ప్రవేశపెడుతున్నారని కూడా శ్రీ నంబూద్రిపాద్ మరొక ప్రశ్నకు జవాబుగా చెప్పారు.

కేరళలో మరల కమ్యూనిస్టులు అధికారంలోకి రాగలరా అని ఒక విలేఖరి ప్రశ్నించగా ఇలా అన్నారు:

"ఎన్నికలను న్యాయంగాను, స్వేచ్ఛగాను జరిపితే మేము విజయం పొందగలమనే ఆశించుచున్నాం."

ప్రణాళికను అమలు జరపడంలో కేరళ ప్రభుత్వానికి ద్వితీయ స్థానం లభించినదనీ, ఇందుకు కమ్యూనిస్టు ప్రభుత్వం గర్వపడుతున్నదని శ్రీ నంబూద్రిపాద్ అన్నారు.

కమ్యూనిస్టు ప్రభుత్వం ఆర్థికస్తోమత

లోక్‌సభలో ప్రశ్నలు

న్యూఢిల్లీ, ఆగస్టు 27

కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వం యొక్క ఆర్థిక పరిస్థితిని గురించి రిజర్వుబ్యాంకువారు కేంద్రానికి ఏమీ నివేదిక పంపలేదని, ఆర్థిక ఉపమంత్రి శ్రీమతి తారకేశ్వరి సిన్హా నేడు లోక్‌సభలో శ్రీ పి. సి. బారువా ప్రశ్నకు సమాధానం చెప్పారు.

కేరళలో ప్రభుత్వ డబ్బు కమ్యూనిస్టు పార్టీ నిధులకు ఉపయోగింపబడ్డదా అన్న ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ కేంద్రానికి ఆవిషయం గురించి సమాచారం లేదన్నారు.

కమ్యూనిస్టు ప్రభుత్వం, రిజర్వుబ్యాంకునుండి 3 కోట్ల రూపాయలను అదనంగా తీసుకున్నదనీ, కేంద్రం పన్నులనుండి ఆ రాష్ట్రానికి రావలసిన వాటానుండి ఆ సొమ్మును చెల్లించివేసిందనీ శ్రీమతి తారకేశ్వరి సిన్హా చెప్పింది.

కేరళరాష్ట్రం కోరినట్లే, అట్టి అడ్వాన్సులు కావాలని ఇతర రాష్ట్రాలు కూడా కోరాయని ఆమె చెప్పింది.

జపానులో వర్షం భీభత్సం

17 మంది మరణం

టోకియో, ఆగస్టు 27

మధ్య జపానులో మంగళవారం నాడు సంభవించిన విపరీత వర్షాలవలన 17 మంది చనిపోయారనీ, 7 గురు కన్పించడం లేదనీ, 220 మంది గాయపడ్డారనీ జపాను పోలీసు అధికారులు ప్రకటించారు.

40 వేల ఇండ్లలో చాలభాగం తుడుచుకు పోయాయి. [illegible] మునిగిపోయాయి.

లండన్‌కు ఐసెన్‌హోవరు రాక

లండన్, ఆగస్టు 27

అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ పశ్చిమజర్మనీలో సంభాషణలు ముగించుకొని నేటి రాత్రి ఇక్కడకు విమానంపై చేరారు. బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్‌తో ఆయన సంభాషణలు జరుపుతారు.

ఎగువ సీలేరుడాము నిర్మాణానికి ఒరిస్సా అనంగీకారం

భువనేశ్వర్, ఆగస్టు 27

ఆంధ్ర - ఒరిస్సా ప్రాంతాలలో ప్రవహించే ఎగువ సీలేరుపై డాము నిర్మించాలన్న ఆంధ్రప్రభుత్వ ప్రతిపాదనను ఒరిస్సా ప్రభుత్వం అంగీకరించలేదని ఇరిగేషన్ మంత్రి శ్రీ భంజదేవ్ నేడు ఒరిస్సా శాసనసభలో తెలియజేశారు. ఈ డాము నిర్మిస్తే, ఒరిస్సా ప్రాంతంలో 70 చదరపుమైళ్లమేర మునిగిపోతుందని ఆయన అన్నారు. త్వరలో ఆంధ్ర, ఒరిస్సా అధికారులు కలుసుకొని సంభాషణలు జరుపనున్నారనీ, సీలేరు నదిపై 9 మైళ్ళ ఎగువన వేరే డాము నిర్మించాలన్న ప్రతిపాదన ఒరిస్సాకు కలదని అన్నారు.

లావోస్ 'పరిశీలకుడు'గా భారతదేశం?

లండన్, ఆగస్టు 27

లావోస్‌లో భారతదేశం "పరిశీలకుడి"గా వ్యవహరించాలని ఐరాస కార్యదర్శి హామర్‌షెల్డ్ నేడొక సూచన చేశారని, ఈ సూచనను బ్రిటన్, ఫ్రాన్సులు అంగీకరించాయని పారిస్ నుండి ఒక వార్త.

అయితే ఈ వార్తను లండన్‌లోని అధికారులు యింకా ధృవీకరించలేదు.

లావోస్‌లోని అంతర్జాతీయ పర్యవేక్షక సంఘానికి భారతదేశం అధ్యక్షురాలన్న సంగతి పాఠకులకు విదితమే.

శ్రీమతి విజయలక్ష్మి

లండన్, ఆగస్టు 27

లండన్‌లో తానింతవరకు భారత హైకమిషనర్‌గా వున్న పదవి నుండి కొద్ది రోజులలోనే వైదొలగనున్నట్లు శ్రీమతి విజయలక్ష్మి పండిట్ నేడొక ప్రకటనలో తెలియజేశారు. వచ్చే కొలదినెలల్లో తన కార్యక్రమం ఏమిటో త్వరలోనే నిర్ణయించగలనని కూడా చెప్పారు.

'కేరళలో ఎన్నికల ఒడంబడిక'

ప్ర. సో. పార్టీ నిర్ణయం

తిరువనంతపురం, ఆగస్టు 27

కేరళ కమ్యూనిస్టేతర పార్టీలతో తాము ఎన్నికల ఒడంబడిక జరుపుకొని, కమ్యూనిస్టుపార్టీని ఓడించడం ద్వారా, ఆ పార్టీని ఏకాకిని చేసివేయగలమని కేరళ ప్ర. సో. పార్టీ కార్యదర్శి శ్రీ శ్రీధరన్ నేడు అన్నారు.

కేరళ ప్ర. సో. పార్టీ కమిటీ నేడు సమావేశమై ఇతర 'ప్రజాతంత్ర పక్షాల'తో ప్ర. సో. పార్టీ సహకరించాలని నిర్ణయించింది.

కేన్సులో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలలో ప్రథమ బహుమతినొంది మనదేశంలోను, ప్రపంచమందంతటా ప్రముఖులచేతను, పత్రికలచేతను ఉత్తమచిత్రమని కొనియాడబడుచున్న సోవియట్ చిత్రం
నేదే చూడండి: విజయవాడ — అలంకార్‌లో
The Cranes Are Flying
రక్తజ్వాలలు
ఇందులో ముఖ్యంగా కథఅంతటను కెమెరాతో చూపించిన నైపుణ్యాన్ని చూడవల్సిందే!
ముందుగా కథాసంగ్రహం చదివి చిత్రాన్ని చూడండి


ముచ్చటైన
3 వ వారం
ఆంధ్రప్రదేశ్ మైసూరులలో విజయయాత్ర సాగించుచున్నది
రాజ్యం పిక్చర్సు
కృష్ణలీలలు
ప్రొడ్యూసర్: రాజ్యం
బెంగుళూరు - మినర్వా-జైహింద్-ప్యాలెస్ మైసూరు: రాజకమల్
ఆంధ్రప్రదేశ్: నవయుగ మైసూరు: రాజశ్రీ
PRASADS



నవ జీవనం
"విపంచి వినిపించిన వినూత్న విశ్వశ్రుతి విన్నావుకదూ?
విన్నావుకదూ నవజీవన మవతరించి అవనిని
ఆత్మీయతతో పిలిచే పురిటి కేకలో భావిక ప్రణవం?
కన్నావు కదూ, కష్టించే కోట్లాది కర్మిష్ఠులం.
నిర్మాతల సృజనాత్మక శక్తుల విన్యాసం? ఈ శిల్పులు
కల్పించే రూపం రేపటి లోకం. రవంత వంత
వశించిన లోకం; మరింత మోదం నిండిన లోకం. నీవిన్నది.
కన్నది నవజీవన చైతన్యపు శక్తుల విజృంభణ-
తరతరాల స్తబ్దత వదలిన దేశం పరిఢవించి పురోగ మిస్తోంది.

ఈ ప్రస్థానంలో ... నేడూ, విన్నటివలెనే మా ఉత్పత్తులు మీ గృహం శుభ్రతకీ, ఆరోగ్యానికీ, ఆనందానికీ ఉపకరిస్తాయి. పైగా మా నేటి కృషికి మరొక లక్ష్యం ... రేపు — రేపటి మీ పెరిగే జీవన ప్రమాణాలతో పెరిగే అవసరాలను తృప్తిపరచడం. అందుకై మేము విస్తృత సేవా సౌకర్యాలతో, కొత్త కొత్త ఊహాలతో, కొత్త కొత్త ఉత్పత్తులతో తయారుగా వుంటాము.
నేడూ, రేపూ... హిందుస్థాన్ లీవర్ గృహములకు సేవ చేయుచున్నది.
PR.2-X117 TL

సంపాదకవర్గం: మోటూరు హనుమంతరావు (అధ్యక్షులు), కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరి బలరామమూర్తి: విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్, కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్సు, విజయవాడ-2.